



చెన్నై సచివాలయం నుండి లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు ముందస్తు ఏర్పాట్లపై రిటర్నింగ్ అధికారులు, జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి సత్యప్రద సాహు



శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను ఆయన నివాస గృహంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్న మాజీ క్రికెటర్ దిలీప్ వెంగ్‌సర్కార్

టీటీడీ ఆలయ విస్తరణకు రూ.1.2 కోట్లు

- అరుణ్ యాక్సెస్ హెల్త్‌కేర్ గ్రూప్ చైర్మన్ విరాళం

చెన్నై, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్ వెంకట నారాయణరోడ్డులో వున్న శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ విస్తరణకు మరో రూ.1.2 కోట్ల విరాళం అందింది. 'అరుణ్ యాక్సెస్ హెల్త్‌కేర్ చైర్మన్ వర్ధమాన్ జైన్ ఈ మేరకు చెక్కును టీటీడీ ఈవో వి.ధర్మారెడ్డికి శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చెన్నై సమాచార కేంద్రం సలహామండలి అధ్యక్షుడు ఏజే శేఖర్ కూడా వున్నారు. ఆలయ విస్తరణ కోసం టీటీడీ ఏర్పాటు చేసిన 'భూదానం' పథకానికి భక్తులు భారీ విరాళాలు అందజేస్తున్న విషయం తెలిసిందే. ఏజే శేఖర్ నేతృత్వంలో ఆలయ విస్తరణ కోసం అవసరమైన ముందస్తు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి.



టీటీడీ ఈవోకు చెక్కు అందజేస్తున్న వర్ధమాన్ జైన్, ఏజే శేఖర్

17 నుంచి ఊటీ ఫ్లవర్ షో

- సిద్ధమవుతున్న పర్యాటక స్వర్గం
- కొడైకెనాల్‌లో విరుల సోయగం



కొడైకెనాల్ బ్రైంట్‌పార్కులో పూలను తిలకిస్తున్న పర్యాటకులు



ఊటీ బొటానికల్ పార్కులో పూలకుండీలు అమర్చుతున్న కార్మికులు

చెన్నై, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక ప్రాంతాలు ఊటీ, కొడైకెనాల్‌లో ఉద్యానవనాలు సమ్మర్ సీజన్‌కు సిద్ధమవుతున్నాయి. ఊటీ బొటానికల్ పార్కు వార్షిక ఫలపుష్ప ప్రదర్శనకు సిద్ధమవుతోంది. ఇక కొడైకెనాల్‌లో పర్యాటకులను ఆకట్టుకునేలా అంతటా వివిధ రకాల పుష్పాలు విరబూసాయి. ఊటీలోని ప్రభుత్వ బొటానికల్ గార్డెన్‌లో మే 17న ఫల పుష్ప ప్రదర్శన ప్రారంభం కానుంది. జిల్లా యంత్రాంగం, ప్రభుత్వ ఉద్యానవనాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఫ్లవర్‌షో ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రదర్శన మే 23 వరకు కొనసాగనుంది. అదే విధంగా మే 24 నుంచి మూడు రోజులపాటు కున్నూరు సిమ్స్ పార్కులో 64వ పండ్ల ప్రదర్శన జరుగనుంది. ఫ్లవర్‌షోకు సంబంధించి ఊటీ బొటానికల్ గార్డెన్‌లో అధికారులు ఏర్పాట్లు చేపడుతున్నారు. ఈ ఫలపుష్ప ప్రదర్శన కోసం 60 వేలకు పైగా కుండీలలో 62 రకాల పుష్పాలను సిద్ధం చేస్తున్నారు. ఈ సారి సమ్మర్ సీజన్‌కు వచ్చే పర్యాటకులకు డేలియా, సాల్వియా, కేండిబట్, జెనియా, పాల్సమ్, ఆజిరెట్టా తదితర రకాలకు చెందిన పుష్పాలు కనువిందు చేయనున్నాయి. ఇక ప్రదర్శన జరిగే ప్రాంతాల్లో పచ్చికబయళ్ళను కూడా పెంచుతున్నారు. ఊటీ ఉద్యానవనాలను సందర్శించడానికి శుక్రవారం నుంచి ప్రత్యేక బస్సులను కూడా నడుపుతున్నారు.

కొడైకెనాల్‌లో...

కొడైకెనాల్ బ్రయింట్ పార్కులో మేలో సమ్మర్‌సీజన్‌కు వచ్చే పర్యాటకులకు కనువిందు చేసేలా వివిధ రకాల పుష్పాలు విరబూస్తున్నాయి. ప్రతియేటా ఏప్రిల్, మే నెలల్లో కొడైకెనాల్‌లో సమ్మర్ సీజన్ ప్రారంభమవుతుంది. దేశవిదేశాల నుంచి పర్యాటకులు వేల సంఖ్యలో వస్తుంటారు. వీరి కోసం ప్రత్యేకంగా భారీ స్థాయిలో ఫ్లవర్‌షో కూడా ఏర్పాటు చేస్తుంటారు. ఆ మేరకు 61వ ఫ్లవర్‌షోకు బ్రయింట్ పార్కు సిద్ధమవుతోంది. ఆ మేరకు ఊటీ, బెంగళూరు, కోల్‌కత్తా, ఢిల్లీ తదితర నగరాల నుంచి సుమారు 2.5 లక్షల వివిధ రకాల పూల వేర్లను కొద్ది నెలల క్రితం తీసుకువచ్చి ఈ ప్రాంతంలో పెంచారు. ఆ మొక్కలు ప్రస్తుతం పెరిగి పెద్దవై విరగబూస్తున్నాయి. ప్రస్తుతం సాల్వియా, పాటీ, డెల్ఫినియం, ఆస్టర్, మేరీ గోల్డ్, ప్యాన్సీ రకాలు, పెట్టునియా, పొట్టి రకం సాల్వియా, కేలండుల్లా, బ్లాక్స్, డేలియా, రోస్ తదితర పుష్పాలు విరగబూస్తున్నాయి. వీటిని రోజూ పర్యాటకులు సందర్శిస్తున్నారు.

చెన్నై నగరంలో మరో ఫ్లై ఓవర్

- వళ్లువర్‌కోట్టం వద్ద రూ. 64.5 కోట్లతో నిర్మాణం
- జూన్‌లో పనులు ప్రారంభం



చెన్నై, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక వళ్లువర్‌కోట్టంలో నిత్యం ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు అడుగులు ముందుకు పడుతున్నాయి. ఆ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు నాలుగు రహదారుల పై ఓవర్‌ను నిర్మించనున్నారు. ప్రస్తుతం ఆ జంక్షన్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ద్వారా వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరిస్తున్నారు. పగటి వేళ ఆ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య లేకపోయినా, ఉదయం, సాయంత్రం నుంగంబాక్కం, వడపళని, టినగర్ వైపు మార్గాల్లో విపరీతంగా ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతోంది. వాహన చోదకులు రోజూ ఎదుర్కొనే ఈ గడ్డు పరిస్థితిని తొలగించే దిశగా గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఇక్కడ కొత్తగా రూ.64.5 కోట్లతో ఫ్లైఓవర్ నిర్మించనుంది. పామ్‌గ్రోవ్ హోటల్ నుంచి కోడంబాక్కం హైరోడ్డు వరకు ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టుకు ప్రైవేటు స్థలాల సేకరణలో ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రస్తుతం ఆ స్థలాల సేకరణ సాఫీగా ముగియడంతో కార్పొరేషన్ టెండర్లు పిలిచింది. జూన్ నుంచి ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని, గ్రేటర్ చెన్నై చీఫ్ ఇంజనీర్ ఎస్.రాజేంద్రన్ తెలిపారు. ఈ ఫ్లైఓవర్ నిర్మాణానికి 10 వేల చదరపుటడుగుల విస్తీర్ణం కలిగిన స్థలం అవసరంగా కాగా అందులో 8 వేల చదరపుటడుగుల స్థలం ప్రభుత్వ స్థలంగా ఉందని, తక్కిన 2 వేల చదురపుటడుగులు ప్రైవేటు వ్యక్తులకు చెందినవని ఆయన వివరించారు. ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉన్న స్థలాలను మార్కెట్ రేటుకు విక్రయించేందుకు సమ్మతించడంతో స్థల సేకరణకు ఎదురైన అడ్డంకులు తొలగిపోయాయని ఆయన పేర్కొన్నారు. రెండేళ్లలో ఆ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు పూర్తవుతాయని చెప్పారు.

అన్నాడీఎంకేలో కొత్త గుర్తింపుకార్డులు

- త్వరలో 2.5 కోట్ల మందికి పంపిణీ



సేలంలో ప్రారంభించిన చలివేంద్రంలో ప్రజలకు పుచ్చకాయలు అందిస్తున్న పళనిస్వామి

ప్యారీస్, ఏప్రిల్ 26: రాష్ట్రంలో మిగతా పార్టీల కంటే ముందుగానే అన్నాడీఎంకే 2026 అసెంబ్లీ ఎన్నికలకు కార్యకర్తలను సిద్ధం చేస్తోంది. ఇందు కోసం అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఫొటో, సంతకంతో కూడిన కొత్త గుర్తింపుకార్డులను సుమారు రెండున్నర కోట్ల మంది కార్యకర్తలకు త్వరలో అందజేనున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యాలయం ప్రకటించింది. రాష్ట్రంలో ఈ నెల 19న జరిగిన తొలి విడత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ కూటమి నుంచి వైదొలిగిన అన్నాడీఎంకే ఒంటరిగా పోటీచేయడంపై పార్టీ కార్యకర్తల్లో జోష్ పెరిగింది. ఈ నేపథ్యంలో 2026 సంవత్సరం జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో మెజార్టీ సీట్లు సాధించి అధికారంలో కూర్చోవాలన్న లక్ష్యంతో అన్నాడీఎంకే వ్యూహం రచించింది. అందులో భాగంగా ప్రస్తుతం ఆ పార్టీలో ఉన్న సుమారు రెండున్నర కోట్ల మందికి పైగా కార్యకర్తలకు అసెంబ్లీ ఎన్నికల విధులు కేటాయించేందుకు పార్టీ అధిష్ఠానం నిర్ణయించింది. ఈపీఎస్‌ను అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా ఎన్నికల కమిషన్ అంగీకరించడంతో పాటు న్యాయస్థానాలు కూడా ఆయనకు అనుకూలంగా తీర్పులిచ్చిన విషయం తెలిసిందే. అందువల్ల పళనిస్వామి ఫోటో, సంతకంతో కొత్త సభ్యత్వ గుర్తింపుకార్డులు ముద్రించే పనులు మొదలయ్యాయి. ఈ గుర్తింపుకార్డులో పార్టీ వ్యవస్థాపకులు ఎంజీఆర్, మాజీ ముఖ్యమంత్రి జయలలిత ఫోటోలు కూడా చోటుచేసుకున్నట్లు తెలిసింది. కొత్తగా డిజైన్ చేసిన సభ్యత్వ గుర్తింపుకార్డుల పంపిణీ కార్యక్రమం స్థానిక రాయపేటలో ఉన్న పార్టీ ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాలిగైలో ఈపీఎస్ త్వరలోనే ప్రారంభిస్తారని, దీనికి సంబంధించి ఆ పార్టీ జిల్లా కార్యదర్శులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నిర్వాహకులతో త్వరలోనే సమావేశం ఏర్పాటవుతుందని తెలిసింది.

జూన్‌లో నగరానికి తెలుగు గంగ



చెన్నై, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నైకి జూన్‌లోనే తెలుగు గంగ జలాలు రానున్నట్లు రాష్ట్ర జలవనరుల శాఖాధికారులు తెలిపారు. ప్రస్తుతం నగరానికి మంచినీరందిస్తున్న ప్రధాన జలాశయాల్లో నీటిమట్టం బాగా తగ్గిపోవడంతో నిర్లవణీకరణ కర్మాగారాల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. అదే సమయంలో రెండు రాష్ట్రాల మధ్య 1083లో కుదిరిన ఒప్పందం ప్రకారం ఈ సీజన్‌కు కండలేరు జలాశయం నుంచి కృష్ణా జలాలను విడుదల చేయాలని రాష్ట్ర ప్రజాపనుల శాఖ ఉన్నతాధికారులు కొద్ది రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి లేఖ రాశారు. రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం ప్రకారం ప్రతియేటా ఏపీ ప్రభుత్వం చెన్నై నగరానికి 12 టీఎంసీల జలాలను విడుదల చేయాల్సి ఉంది. జనవరి నుంచి ఏప్రిల్ వరకు 4 టీఎంసీలు, జూలై నుంచి అక్టోబర్ దాకా 8 టీఎంసీల చొప్పున కండలేరు జలాశయం నుండి కృష్ణానదీ జలాలను విడుదల చేయాలి. అయితే గత యేడాది జూన్ నుంచి మే వరకు రెండున్నర టీఎంసీల కండలేరు జలాలను సరఫరా చేశారు. ఆ సమయంలో చెన్నై పరిసర జిల్లాల్లో భారీగా వర్షాలు కురవటంతో మిగతా జలాల కోసం ప్రజాపనుల శాఖాధికారులు ఏపీ ప్రభుత్వంపై ఎలాంటి ఒత్తిడి చేయలేదు. ఆ నేపథ్యంలో గత డిసెంబర్‌లో చెన్నై, సబర్బన్ ప్రాంతాలలో కుండపోత వర్షాలకు వరదలు రావడంతో కండలేరు జలాలను విడుదల చేయవద్దని ఏపీ ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ప్రస్తుతం నగరానికి మంచినీరందించే ప్రధాన జలాశయాల్లో నీటిమట్టం తగ్గుతుండటంతో ప్రజాపనుల శాఖ అధికారులు తెలుగు గంగ విడుదల చేయాలని ఏపీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అయితే ప్రస్తుతం 68 టీఎంసీల వరకు నీరు నిల్వ చేయడానికి అవకాశమున్న కండలేరు జలాశయంలో ఆరు టీఎంసీల మేరకే నీరుండటంతో చెన్నై నగరానికి జలాలను విడుదల చేయలేమని ఏపీ ప్రభుత్వం చేతులెత్తేసింది. నాలుగు నెలలుగా కండలేరు జలాశయం నుంచి చెన్నైకి నీరు విడుదల చేయలేదు. ఈ పరిస్థితులలో రాష్ట్ర ప్రజాపనుల శాఖ ఉన్నతాధికారులకు ఏపీ ప్రభుత్వం ఓ వర్తమానం పంపింది. ఆ మేరకు రాష్ట్రంలో మే, జూన్ నెలలో భారీగా వర్షాలు కురిసి కండలేరు జలాశయంలో జలాలు సమృద్ధిగా నిండితే జూన్ నుంచి తెలుగు గంగ జలాలను విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటమాని ఏపీ ప్రభుత్వ అధికారులు ఆ వర్తమానంలో స్పష్టం చేశారు. జనవరి - ఏప్రిల్ మధ్య విడుదల కావాల్సిన 4 టీఎంసీల జలాలను జూన్‌లో విడుదల చేస్తామని హామీ ఇచ్చినట్లు తమిళనాడు ప్రభుత్వ అధికారులు తెలిపారు.

కమనీయం... పుష్పపల్లకీ ఉత్సవం

- పూలపల్లకీ సేవతో కళ్ళలగర్‌కు వీడ్కోలు
- అళగర్‌మలైకి నేడు పునరాగమనం



చెన్నై, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మదురై చిత్తిరై ఉత్సవాల్లో రెండో కీలక ఘట్టమైన కళ్ళలగర్ పూల పల్లకీ సేవ శుక్రవారం ఉదయం కనుల పండువగా నిర్వహించారు. మదురై తల్లాకుళం మైదానానికి చేరువగా ఉన్న కరుప్పణ్ణసామి ఆలయానికి ఎదురుగా కళ్ళలగర్ స్వామి పూలపల్లకీలో వేంచేశారు. ఈ వేడుకలను తిలకించేందుకు మదురై నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుండి కూడా వేలాదిమంది భక్తులు గురువారం రాత్రే చేరుకున్నారు. శుక్రవారం వేకువజాము నుంచే భక్తులు పల్లకీలో వేంచేసిన స్వామివారిని క్యూలైన్లలో నిలిచి దర్శించుకున్నారు. పూలపల్లకీ సేవ అనంతరం కళ్ళలగర్ స్వామికి భక్తులంతా భారమైన మనస్సుతో వీడ్కోలు పలికారు. భక్తులందరికీ దర్శనమిచ్చిన తర్వాత కళ్ళలగర్ స్వామి అళగర్‌మలై వైపు బయలుదేరారు. ఆయన వెంటే వేలాదిమంది భక్తులు కదిలారు. మూండ్రుమావడి, అప్పన్ తిరుప్పతి, కళ్ళంత్రి ప్రాంతాల మీదుగా మార్గమధ్యంలోని పలు మండపాల్లోనూ స్వామివారు సేదతీరుతూ వెళ్ళారు. కళ్ళలగర్‌కు దారిపొడవునా స్థానికులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. అళగర్ వెళ్లే దారిలో పలుచోట్ల భక్తులు నీటిని చల్లారు. పల్లకీ మోస్తున్నవారి పాదాలు కందిపోకుండా ఉండేందుకు రహదారిపై నీటిని చల్లటంతోపాటు భక్తులకు మజ్జిగ, పానకం తదితర శీతలపానీయాలను పంపిణీ చేశారు. పలు చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేసి భక్తమండళ్ల నిర్వాహకులు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. ఇలా దారిపొడవునా వివిధ సేవల్లో పాల్గొననున్న కళ్ళలగర్‌స్వామి శనివారం ఉదయం తన స్వక్షేత్రానికి చేరటంతో చిత్తిరై ఉత్సవాలు ముగియనున్నాయి.

పెరంబలూరు జిల్లాలో ఘోరం

- తండ్రిపై కుమారుడి దారుణ దాడి
- ముఖంపై ముష్టిఘాతాలు కురిపించి హత్య?
- ఆత్మహత్యగా పోలీసుల కేసు నమోదు
- వృద్ధుడి మృతిలో అన్నీ అనుమానాలే!

చెన్నై, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అల్లారు ముద్దుగా పెంచి పెద్ద చేసిన తండ్రిని దారుణంగా హతమార్చాడో కుమారుడు. బాధ్యత మరచి, అల్లరిచిల్లరగా తిరుగుతున్న కుమారుడిని మందలించడంతో పాటు అతడు అడిగినంత డబ్బు ఇవ్వలేదన్న కోపంతో డెబ్బై యేళ్ల తండ్రిపై ముష్టిఘాతాలు కురిపిస్తూ, కాళ్లతో తన్నుతూ రాక్షసంగా వ్యవహరించాడా ప్రబుద్ధుడు. ఆఖరికి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అతను మరణించాడు. పెరంబలూరు జిల్లా కృష్ణాపురంలో ఈ ఘటన జరిగింది. అయితే ఆ కుమారుడి దగ్గర లంచాలు తీసుకుని స్థానిక పోలీసులు.. కేసును తారుమారు చేశారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. కొడుకు దాడితో వృద్ధుడు చనిపోగా, ఆ దెబ్బలు తాళలేక వృద్ధుడు విషం సేవించి మృతిచెందినట్లు కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంపై తీవ్ర విమర్శలు రావడంతో డీజీపీ శంకర్ జీవాల్ స్పందించారు. తక్షణం అతడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని సంబంధిత పోలీసుల్ని ఆదేశించారు. పలువురి హృదయాలను కలిసివేస్తున్న ఈ ఘటన వివరాలిలా వున్నాయి...

సేలం జిల్లా ఆత్తూరులో 'శ్రీ అమృత సెగో ఫ్యాక్టరీ' వుంది. దాని యజమాని కొళందైవేలు కాగా, ఆయన కుమారుడు శక్తివేల్. చిన్నప్పటి నుంచి అల్లరిచిల్లరిగా తిరుగుతూ బాధ్యత లేకుండా వ్యవహరించేవాడని తెలిసింది. అంతేగాక తన జల్సాలకు డబ్బు సరిపోవడం లేదని, అందువల్ల ఆస్తిని తన పేర రాయాలంటూ తల్లిదండ్రులపై ఒత్తిడి చేసేవాడు. పెరంబలూరులో వున్న రైస్‌మిల్లును అతడే నిర్వహించేవాడు. దొరికిన చోటల్లా అప్పులు చేసి, జల్సాలకు ఖర్చుచేసేవాడు. ఆ అప్పులను తండ్రి కొళందైవేలు తీరుస్తుండేవాడు. ఈ వ్యవహారంలో తండ్రీకొడుకుల మధ్య పలుమార్లు గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో ఆ రైస్‌మిల్లును తన పేర రాయాలని, తండ్రి ఆస్తిలో 50 శాతం తనకు ఇప్పుడే పంచి ఇవ్వాలని పట్టుబట్టాడు. ఇందుకు కొళందైవేలు నిరాకరించాడు. దీంతో కోపం పెంచుకున్న శక్తివేల్ ఫిబ్రవరి 16వ తేదీన కృష్ణాపురంలోని తన ఇంటి సోఫాలో కూర్చొనివున్న తండ్రిపై దాడి చేశాడు. వృద్ధుడి ముఖంపై, రెండు దవడలు, కణతలపై ముష్టిఘాతాలు కురిపించాడు. దీంతో నోరు, ముక్కు, చెవుల నుంచి తీవ్ర రక్తం స్రవిస్తుండగా, కొళందైవేలు సోఫాలోనే పక్కకు ఒరిగిపోయాడు. అతను చనిపోయాడనుకుని సంతోష్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఆ తరువాత అక్కడకు వచ్చిన కార్మికులు కొళందైవేలును ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఈలోగా మళ్లీ అక్కడకు వచ్చిన శక్తివేల్.. తండ్రి ముఖంపై కాళ్లతో తన్నాడు. దీంతో కొళందైవేలు తీవ్రంగా గాయపడ్డారు. ఆయన్ని భార్య హేమ, కార్మికులు కలిసి తిరుచ్చి ఆస్పత్రిలో చేర్పించారు. దానిపై అందిన ఫిర్యాదును పోలీసులు తేలిగ్గా తీసుకున్నారు. శక్తివేల్‌ను స్టేషన్‌కు పిలిపించి, సకలమర్యాదలతో 'మందలించి' పంపించారు. అయితే ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కొళందైవేల్ ఈ నెల 21న తుది శ్వాస విడిచారు. అప్పటి నుంచి శక్తివేల్ పరారీలో వున్నాడు. అయితే ఈ విషయాన్ని పోలీసులు పట్టించుకోలేదు. అయితే తండ్రిపై శక్తివేల్ చేసిన దాడి దృశ్యాలు సీసీ కెమెరాలో నిక్షిప్తమవ్వడంతో అవి సామాజిక మాధ్యమాల్లో వైరలయ్యాయి.



తండ్రిపై దాడి చేస్తున్న సంతోష్.. సోఫాలో ఒరిగిపోయిన కొళందైవేలు

ఈ విషయం తెలుసుకున్న డీజీపీ స్పందించారు. ఈ కేసుపై తక్షణం చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసులను ఆదేశించారు. దీంతో కైకాలత్తూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని శక్తివేల్‌ను గురువారం అరెస్టు చేశారు. కొసమెరుపేంటంటే.. కొడుకు దాడి ఘటనతో మనస్తాపం చెందిన కొళందైవేల్.. విషం తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిర్వహించి శుక్రవారం అంత్యక్రియలు కూడా పూర్తి చేశారు. అయితే కనీసం కూర్చున్న చోటి నుంచి పైకి కూడా లేవలేని స్థితిలో వున్న కొళందైవేలుకు విషం ఎక్కడి నుంచి వచ్చింది? ఆయన విషం సేవించే స్థితిలో వున్నాడా?.. అన్న అనుమానాలు రేగుతున్నాయి. శక్తివేల్ వద్ద లంచం పుచ్చుకున్న కొంతమంది పోలీసులు.. కేసును నీరు గార్చేందుకే కొళందైవేలు ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకరించారని బంధువులు ఆరోపిస్తున్నారు.

సమాచార ధ్వని

29 నుంచి వేసవి క్రీడా శిక్షణ

ఐసిఎఫ్, ఏప్రిల్ 26: రాష్ట్ర క్రీడాభివృద్ధి కమిషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29 నుంచి మే 13వ తేది వరకు వేసవి క్రీడా శిక్షణ జరుగనుంది. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ఆయా జిల్లాల ప్రధాన కేంద్రాల్లో నిర్వహించే శిక్షణలో ఆసక్తి ఉన్న వారు పాల్గొనవచ్చు. శిక్షణా ఫీజు చెన్నైలో రూ.500, ఇతర నగరాల్లో రూ.200 చెల్లించాలి. ఇతర వివరాలకు www.sdat.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

7న స్పోర్ట్స్ హాస్టల్‌లో చేరేందుకు పరీక్ష

ఐసిఎఫ్, ఏప్రిల్ 26: స్పోర్ట్స్ హాస్టల్‌లో చేరేందుకు మే 7వ తేది పరీక్షలు జరుగనున్నాయి. పాఠశాల, కళాశాలల్లో చదివే విద్యార్థుల్లో క్రీడాకారులను ఎంపిక చేసి బస, భోజన సౌకర్యంతో క్రీడా శిక్షణ ఇచ్చేలా హాస్టళ్లలో అడ్మిషన్లు కల్పిస్తున్నారు. ఇందుకోసం వేర్వేరు స్పోర్ట్స్ పరీక్షలు నిర్వహించి అర్హులైన వారిని చేర్చుకుంటున్నారు. ఆ ప్రకారం, మే 7వ తేది ఉదయం అథ్లెటిక్స్, బాక్సింగ్, టేబుల్ టెన్నిస్, తైక్వాండో, వెయిట్‌లిఫ్టింగ్ విభాగాలకు పెరియమేడు నెహ్రూ స్టేడియం, నుంగంబాక్కంలో టెన్నిస్, వేళచ్చేరి స్విమ్మింగ్ పూల్‌లో జిమ్నాస్టిక్, ఈత, చెంగల్పట్టులో సైక్లింగ్ పరీక్షలు జరుగనున్నాయి. దరఖాస్తులను www.sdat.tn.gov.in, tntalent.sdat.in అనే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఇతర వివరాలకు 9514000777 అనే నెంబరు సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

10న బ్రాహ్మణ పిల్లలకు ఉపనయనం

ఐసిఎఫ్, ఏప్రిల్ 26: రామకృష్ణ మిషన్ స్టూడెంట్స్ హోం ఆధ్వర్యంలో పేద బ్రాహ్మణ పిల్లలకు ఉచిత ఉపనయనం మే 10వ తేది జరుగనుంది. మైలాపూర్‌లో ఉన్న ఈ హోం ఆధ్వర్యంలో ప్రతి ఏటా ఆర్థికంగా వెనుకబడిన బ్రాహ్మణ పిల్లలకు ఉపనయనం ఉచితంగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో, అక్షయ తృతీయ రోజైన మే 10వ తేది జరిగే కార్యక్రమంలో తమ పిల్లలతో హాజరుకావాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఇతర వివరాలకు http://-www.rkmshome.org అనే వెబ్‌సైట్, chennai.stdentshome@rkmm.org అనే ఈ-మెయిల్‌లో సంప్రదించవచ్చు.

నేడు సర్ త్యాగరాయ జయంతి వేడుకలు

అడయార్, ఏప్రిల్ 26: జస్టిస్ పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరు, మద్రాస్ నగర ప్రథమ మేయర్ సర్ పిట్టి త్యాగరాయ శ్రేష్టి జయంతి వేడుకలు శనివారం నగరంలో జరుగనున్నాయి. ఈ వేడుకలు సర్ త్యాగరాయ కళాపరిషత్ ఆధ్వర్యంలో జరుగనున్నాయి. ఈ సందర్భంగా తండయారుపేట, టీహెచ్ రోడ్డులోని త్యాగరాయ పార్కులో ఉన్న త్యాగరాయ విగ్రహంతో పాటు సర్ త్యాగరాయ కళాశాలలో ఉన్న త్యాగరాయ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించనున్నారు. ఈ కార్యక్రమంలో నగరంలోని తెలుగు ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని త్యాగరాయ కళాపరిషత్ నిర్వాహకులు విడుదల చేసిన ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు ముందుగా శనివారం ఉదయం 7.30 గంటలకే మన్నప్ప ముది వీధిలో ఉన్న సర్ త్యాగరాయ ఉన్నత పాఠశాలకు రావాలని వారు కోరారు.

ఉచితంగా ఓఆర్ఎస్ పౌడర్

ఐసిఎఫ్, ఏప్రిల్ 26: స్థానిక సంస్థల ద్వారా ప్రజలకు ఓఆర్ఎస్ పౌడర్ ఉచితంగా అందజేయనున్నట్లు ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. ఎండ తీవ్రత వలన చెమటకాయలు ఏర్పడడంతో పాటు వడదెబ్బకు స్పృహ కోల్పోవడం, నీరసం వంటి లక్షణాలు కనిపిస్తాయని, వీటి నుంచి ఉపశమనం పొందేందుకు ఓఆర్ఎస్ పౌడర్ అందజేయనున్నామని తెలిపారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన వారు ఈ పౌడర్‌ను ఉచితంగా పొందవచ్చని తెలిపారు. అలాగే, త్వరలో స్థానిక సంస్థల ద్వారా కూడా వీటిని పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

50 శాతం ముగిసిన నాలుగో రైల్వే మార్గం

ఐసిఎఫ్, ఏప్రిల్ 26: చెన్నై బీచ్-ఎగ్మూర్ మధ్య జరుగుతున్న నాలుగో రైలుమార్గం పనులు 50 శాతం పూర్తయినట్లు దక్షిణ రైల్వే అధికారులు తెలిపారు. ఈ మార్గంలో ఒక లైన్ ఎక్స్‌ప్రెస్, గూడ్సు రైళ్లు, మరో రెండు మార్గాల్లో సబర్బన్ రైళ్లు నడుస్తున్నాయి. ఈ క్రమంలో, నాలుగో మార్గం పనులు 4.50 కి.మీ దూరం రూ.279 కోట్లతో ప్రారంభమయ్యాయి. ఆరు నెలల్లో పనులు పూర్తి చేయనున్నట్లు ప్రకటించినప్పటికీ, కొన్ని కారణాలతో పనుల్లో జాప్యం జరిగింది. ఇప్పటివరకు 50 శాతం పనులు పూర్తయ్యాయని, జూలైలో నాలుగో మార్గం అందుబాటులోకి వస్తుందని అధికారులు తెలిపారు.

'నమక్కు నామే' పథకానికి అదనపు నిధులు

ఐసిఎఫ్,ఏప్రిల్26:'నమక్కునామే' పథకానికి ప్రభుత్వం అదనంగా రూ.50కోట్లు కేటాయించింది. 2023-24 సంవత్సరం పథకానికి రూ.100 కోట్లు కేటాయించగా, ఈ పథకానికి అదనంగా నిధులు కేటాయించాలని పలు జిల్లాల నుంచి ప్రభుత్వానికి వినతులు అందాయి. దీనిపై స్పందించిన ప్రభుత్వం ఈ పథకానికి అదనంగా రూ.50 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

ప్రభుత్వ పాఠశాలల్లో 3.24 లక్షల మంది చేరిక

ఐసిఎఫ్, ఏప్రిల్ 26: ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఇప్పటివరకు 3.24 లక్షల మంది విద్యార్థులు చేరారని, మరో 2 లక్షల మందిని చేర్చుకుంటున్నామని అధికారులు తెలిపారు. ఈ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగితేనే ప్రభుత్వం కేటాయించిన నిధులు పొందగలరు. దీంతో 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభం కావడానికి ముందే అడ్మిషన్లు ప్రారంభించారు. అవగాహన ప్రచారాల ద్వారా విద్యార్థుల సంఖ్య పెరిగింది. బుధవారం వరకు ప్రభుత్వ, ఎయిడెడ్ ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో 2.99 లక్షల మంది, ఉన్నత, మహోన్నత పాఠశాలల్లో 25,300 మంది చేరారు.

4,335 మెగావాట్లకు చేరిన విద్యుత్ వినియోగం

ఐసిఎఫ్, ఏప్రిల్ 26: నగర విద్యుత్ వినియోగం 4,335 మెగావాట్లకు చేరింది. నగరంలో కొద్దిరోజులుగా ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. ఉదయం 10 గంటల నుంచే ఎండ తీవ్రతకు ప్రజలు అల్లాడుతున్నారు. ఇళ్లు, కార్యాలయాల్లో ఉక్కపోత కారణంగా ఫ్యాన్లు, ఎయిర్ కూలర్లు, ఏసీల వినియోగం అధికమైంది. ఈ నేపథ్యంలో, నగరంలో విద్యుత్ వినియోగం గత ఏడాది గరిష్ఠంగా 4,300 మెగావాట్లకు చేరింది. ఈ నేపథ్యంలో, ఈ నెల 24వ తేది నగర విద్యుత్ వినియోగం 4,335 మెగావాట్ల చేరిందని టాన్‌జెడ్కో తన ఎక్స్ పేజీలో తెలియజేసింది.

30న రెండవ విడత సర్టిఫికెట్ల పరిశీలన

ఐసిఎఫ్, ఏప్రిల్ 26: హిందూ దేవాదాయ శాఖ పోస్టులకు రెండో విడత సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 30వ తేది జరుగనుంది. ఈ శాఖలో ఖాళీగా ఉన్న గ్రూప్-8 కార్యాచరణ అధికారి గ్రేడ్-4 పోస్టుల భర్తీకి 2022 సెప్టెంబరు 11న టీఎన్‌పీఎస్సీ రాతపరీక్ష నిర్వహించింది. మార్కుల జాబితా 2023 జూలై 14న విడుదలైంది. తొలివిడత సర్టిఫికెట్ల పరిశీలన 2023 డిసెంబరు 29న జరిగింది. రెండవ విడత సర్టిఫికెట్ల పరిశీలన బ్రాడ్‌వేలో ఉన్న టీఎన్‌పీఎస్సీ కార్యాలయంలో ఈ నెల 30వ తేది జరుగనుంది. ఇతర వివరాలకు టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

వీఐటీ-ఏపీకి ప్రతిష్ఠాత్మక 'ఎక్సలెన్స్ అవార్డు-2024'

అడయార్, ఏప్రిల్ 26: అమరావతిలోని వీఐటీ-ఏపీకి ప్రతిష్ఠాత్మక 'సీఎస్ఆర్ ఔట్‌స్టాండింగ్ యూనివర్సిటీ ఇన్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు-2024' వరించింది. దేశంలో ఆరు దశాబ్దాలకుపైగా వారసత్వం కలిగిన వీఐటీ అనుబంధ విద్యా సంస్థగా ఉన్న వీఐటీ-ఏపీకి కాంపిటీషన్ సక్సెస్ రివ్యూ (సీఎస్ఆర్) ద్వారా ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు వరించింది. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు వరించడాన్ని పురస్కరించుకుని వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ డాక్టర్ ఎస్‌వీ కోటా రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. 2024 సంవత్సరానికిగాను సీఎస్ఆర్ అత్యుత్తమ యూనివర్సిటీ ఇన్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు అందుకోసం చాలా సంతోషంగాను, గౌరవంగా ఉందన్నారు. ఈ గుర్తింపు తమ విద్యా సంస్థ అధ్యాపకులు, సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థుల అత్యుత్తమ పనితీరుకు నిదర్శనమన్నారు. అలాగే, రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర మాట్లాడుతూ, తమ విశ్వవిద్యాలయం భావితరం నాయకులను ప్రోత్సహించడం, సమగ్ర అభివృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని పెంపొందించడం అంశాలకు కట్టుబడివుందన్నారు. ఈ గుర్తింపు తమ విద్యా ప్రమాణాలను మరింతగాపెంపొందించుకునేందుకు ఎంతగానో దోహదపడుతుందన్నారు.


అవార్డు స్వీకరిస్తున్న కోటారెడ్డి

పార్క్ స్టేషన్‌కు మహర్దశ

● రూ.10.68 కోట్లతో అభివృద్ధి పనులు

అడయార్, ఏప్రిల్ 26: చెన్నై మహానగరంలో సబర్బన్ రైల్వే స్టేషన్లలో అతి కీలకమైన పార్క్ స్టేషన్‌కు మహర్దశ వచ్చింది. దక్షిణ చెన్నై, ఉత్తర చెన్నై రైల్వే ప్రయాణికులను అనుసంధానం చేసే స్టేషన్‌గా గుర్తింపు పొందిన ఈ స్టేషన్‌ను అమృత్ భారత్ పథకం కింద రూ.10.68 కోట్లతో ఆధునికీకరించనున్నారు. ఈ విషయాన్ని దక్షిణ రైల్వే శుక్రవారం విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో పేర్కొంది. ఈ అభివృద్ధి పనుల్లో భాగంగా, కొత్త బుకింగ్ ఆఫీస్‌ను ఎగ్జిక్యూటివ్ లాంజ్‌తో గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తుతో నిర్మిస్తారు. ఈ ఎగ్జిక్యూటివ్ లాంజ్‌లో ఈ స్టేషన్ మీదుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు విశ్రాంతి తీసుకోవచ్చు. బుకింగ్ ఆఫీస్ వద్ద విశాలమైన వెయిటింగ్ హాల్ నిర్మిస్తారు. రైలు ప్రయాణికులు, పాదచారుల సౌకర్యార్థం ఎంఆర్‌టీఎస్ స్టేషన్స్, పూందమల్లి హైరోడ్డులను అనుసంధానం చేసేలా ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలను నిర్మిస్తారు. అదనపు ప్లాట్‌ఫాంతో పాటు ప్లాట్‌ఫాంల పైకప్పులను కొత్తగా నిర్మిస్తారు. దివ్యాంగులు, వయోవృద్ధుల సురక్షిత ప్రయాణ సౌకర్యార్థం మూడు లిఫ్టులతో పాటు హ్యాండ్ రైలింగ్ సదుపాయం కల్పిస్తారు. అలాగే స్టేషన్‌లో పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్‌కు మెరుగులు దిద్దే చర్యల్లో భాగంగా, ప్యాసింజర్ ఇన్ఫర్మేషన్ డిస్‌ప్లే సిస్టమ్, సీసీటీవీలు స్టేషన్‌లో ఏర్పాటు చేస్తారు. ఈ ఆధునికీకరణ పనుల్లో భాగంగా 1ఏ, 1, 2 ప్లాట్‌ఫారాల్లో 50 శాతం పనులు పూర్తి చేసినట్టు దక్షిణ రైల్వే పేర్కొంది. ఇదే విధంగా చెన్నై బీచ్ - చెంగల్పట్టు మార్గంలో చెన్నై బీచ్ సెంట్ థామస్ మౌంట్, గిండి, మాంబాళం, గూడువాంజేరి, చెంగల్పట్టు స్టేషన్లను ఆధునికీకరించనున్నట్టు దక్షిణ రైల్వే ప్రధాన పౌరసంబంధాల అధికారి ఎం.సెంతమిళ్ సెల్వన్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.



మద్యం ప్రియులకు చల్లని కబురు...

పుదుచ్చేరిలో 35 రకాల విదేశీ బీర్లు

పుదుచ్చేరి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండుతున్న నేపథ్యంలో కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరిలో 35 రకాల చల్లటి బీర్ల విక్రయాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పుదుచ్చేరిలో సుమారు 350కు పైగా మద్యం దుకాణాలున్నాయి. ఈ దుకాణాల్లో 1,000కి పైగా రకరకాల బ్రాండ్ల మద్యం విక్రయిస్తున్నారు. పుదుచ్చేరిలో అందుబాటులో ఉన్న మద్యంరుచి చూసేందుకు సమీపంలో ఉన్న తమిళనాడు నుంచి కూడా మందు బాబులు పెద్ద సంఖ్యలో వెళ్తుంటారు. అదే విధంగా విదేశీ పర్యాటకులు కూడా ప్రతిరోజు పుదుచ్చేరికి వచ్చి వెళుతుంటారు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, నెదర్లాండ్ తదితర దేశాలకు చెందిన పర్యాటకుల సూచన మేరకు రాష్ట్ర ప్రభుత్వం 35 రకాల విదేశీ బీర్లను బాటిల్, టిన్, మింట్ బాటిల్, మినీ బీర్ పేర్లతో విక్రయిస్తోంది. వేసవి సీజన్ కావడంతో ఎండ తాపం నుంచి ఉపశమనం పొందేలా మందు బాబులు బీర్లు అధికస్థాయిలో తాగుతున్నారని, ఎండలు ప్రారంభం కాకముందు కంటే ఈ సీజన్‌లో మూడు నుంచి ఐదు రెట్లు బీర్ల విక్రయాలు పెరిగాయని పుదుచ్చేరి అధికారులు తెలిపారు.

సీబీసీఐడీకి రూ.4 కోట్లు స్వాధీనం కేసు

ప్యారీస్, ఏప్రిల్ 26: తాంబరం రైల్వేస్టేషన్‌లో ఈనెల 6వ తేది రూ.4 కోట్ల నగదు పట్టుబడిన కేసు విచారణ సీబీసీఐడీకి బదిలీ అయింది. తిరునల్వేలి బీజేపీ అభ్యర్థి నయినార్ నాగేంద్రన్‌కు చెందిన హోటల్ సిబ్బంది సతీష్ సహా ముగ్గురు తిరునల్వేలి వెళ్లేందుకు తాంబరం రైల్వేస్టేషన్ చేరుకున్న సమయంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వారి బ్యాగులు తనిఖీచేసి రూ.4 కోట్లు స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి రసీదులు లేకుండా తరలిస్తున్న ఈ నగదుకు సంబంధించి వివరణ కోరుతూ నయినార్ నాగేంద్రన్ సహా పలువురికి సమన్లు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో, ఈ కేసు విచారణను సీబీసీఐడీకి బదిలీ చేస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది. శనివారం కేసుకు సంబంధించిన పత్రాలను సీబీసీఐడీ అధికారులకు అప్పగించాల్సిందిగా తాంబరం పోలీసులకు ఆదేశాలు జారీ అయ్యాయి.

గర్భం దాల్చిన బాలిక

● 17 ఏళ్ల బాలుడి సహా కార్మికుడి అరెస్ట్

ప్యారీస్, ఏప్రిల్ 26: బాలుడితో ఏర్పడిన పరిచయం కారణంగా ఓ బాలిక గర్భం దాల్చిన వైనం వెలుగు చూసింది. కోవై జిల్లా మేట్టుపాళయం ప్రభుత్వాస్పత్రికి గురువారం 15 ఏళ్ల బాలిక గర్భకాల చికిత్స కోసం వెళ్లినట్లు కారమడై పంచాయతి అధికారి అమరావతికి సమాచారం తెలిసింది. దీంతో ఆమె ఆసుపత్రికి వెళ్లి విచారించారు. అందులో... గత ఏడాది జనవరిలో 17 ఏళ్ల బాలుడితో ఏర్పడిన పరిచయం ప్రేమకు దారితీసిందని, దీంతో బాలిక గర్భం దాల్చినట్లు తెలిసింది. బాలిక ఇచ్చిన సమాచారంతో మేట్టుపాళయానికి చెందిన లోకేష్ అనే కార్మికుడు సహా గర్భం దాల్చడానికి కారకుడైన బాలుడిని కూడా పోక్సో చట్టం కింద అరెస్ట్ చేశారు. వారిని శుక్రవారం కోర్టులో హాజరుపరచిన అనంతరం పోలీసులు బాలుడిని కోవై పిల్లల సంరక్షణ కేంద్రానికి, కార్మికుడిని జైలుకు తరలించారు.

చిత్తిరై ఉత్సవాల్లో ప్రముఖులకు అవార్డులు


సేవాపరులకు అవార్డులు ప్రదానం చేస్తున్న ఓం పంచశక్తి పీఠం పీఠాధిపతి జ్ఞానసత్యేంద్రస్వామి

చెన్నై, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాణిపేట జిల్లా ఆవలూరులోని శ్రీఓం ఆదిశక్తి ఆశ్రమంలో చిత్రా పౌర్ణమి వేడుకల్లో భాగంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు శ్రీఓం పంచశక్తి పీఠం పీఠాధిపతి ఓం జ్ఞానసత్యేంద్రస్వామి అవార్డులను ప్రదానం చేశారు. ఈ నెల 19న ప్రారంభమైన ఈ వేడుకలు శనివారం సాయంత్రం వరకూ కొనసాగనున్నాయి. శుక్రవారం శ్రీఓం పద్మిని నృత్యకళానికేతన్ విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఆ సందర్భంగా మూడు దశాబ్దాలకు పైగా కుష్ఠురోగులకు సేవలందిస్తున్న శివరామకృష్ణన్‌కు, అరుణోదయం ట్రస్టు వ్యవస్థాపకులు అయ్యప్పన్ సుబ్రమణియన్‌కు, నేత్రదానం, రక్తదానాలకు సహకరించిన పద్మనాథన్, విద్యావేత్త ఆర్ఎస్ఎస్ సేవక్ శ్రీనివాసన్‌కు, జవ్వాదుహిల్స్ మేన్మయ్ ట్రస్టు వ్యవస్థాపకులు నిలా వర్మకు పీఠాధిపతి అవార్డులను ప్రదానం చేశారు.

నల్ల పంది మాంసం విక్రయాలపై నిషేధం

ఐసిఎఫ్, ఏప్రిల్ 26: నగరంలో నల్ల పంది మాంసం విక్రయాలను చెన్నై కార్పొరేషన్ నిషేధించింది. కార్పొరేషన్ సరిహద్దు ప్రాంతాల్లో నాలుగు కబేళాల్లో మాత్రమే మటన్, బీఫ్ విక్రయాలకు కార్పొరేషన్ అనుమతిస్తోంది. అయితే ఆదివారాల్లో నందనం, అన్నాసాలై, పూందమల్లి హైరోడ్డు, సైదాపేట, అంబత్తూర్ తదితర ప్రాంతాల్లో రోడ్ల పక్కన పంది మాంసం విక్రయిస్తున్నారు. అనుమతి లేకుండా పంది మాంసం విక్రయాలపై చర్యలు చేపట్టాలని కార్పొరేషన్‌కు ఫిర్యాదులందాయి. దీనిపై స్పందించిన కార్పొరేషన్, వీటి విక్రయాలు నిషేధిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

పెరిగిన పండ్ల ధరలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 26: స్థానిక కోయంబేడు మార్కెట్లో పండ్ల ధరలు పెరిగాయి. ఈ మార్కెట్‌కు పొరుగు రాష్ట్రాలు, వివిధ జిల్లాల నుంచి కూరగాయలు, పండ్లు దిగుమతవుతున్నాయి. ప్రతిరోజు 700లకు పైగా లారీల్లో 7,500 టన్నుల కూరగాయలు దిగుమతవుతున్నాయి. ఎండ తీవ్రత కారణంగా కూరగాయలు, పండ్లు దిగుబడి తగ్గింది. ఈ కారణంగా కిలోకు రూ.20 నుంచి రూ.25 వరకు ధరలు పెరిగాయి. ప్రస్తుతం దానిమ్మ రూ.240, వాషింగ్టన్ ఆపిల్ రూ.240 నుంచి రూ.260, న్యూజిలాండ్ ఆపిల్ రూ.200 నుంచి రూ.250, బత్తాయి రూ.60 నుంచి రూ.80, ఈజిప్ట్ ఆరంజ్ రూ.120 నుంచి రూ.150, కమల రూ.100 నుంచి రూ.120, పచ్చ ద్రాక్ష రూ.120 నుంచి రూ.130, పైనాపిల్ రూ.80 నుంచి రూ.100, కిరిణి పండ్లు రూ.30 నుంచి రూ.50, పుచ్చకాయలు రూ.15 నుంచి రూ.20, పనస పండు రూ.40 నుంచి రూ.50, ఎర్ర అరటి పండ్లు రూ.60 నుంచి రూ.65, సపోటా రూ.40, జామ రూ.40, మామిడి పండ్లు రూ.70 నుంచి రూ.80, నిమ్మ పండ్లు రూ.40 నుంచి రూ.140కి పెరిగాయి. ఇతర కూరగాయల ధరలు కూడా పెరిగినట్లు వ్యాపారులు తెలిపారు.

సంగనవిడుది వాటర్ ట్యాంక్‌లో పేడనీళ్లు

అధికారుల విచారణ


సంగనవిడుది గ్రామంలోని వాటర్ ట్యాంక్ వద్ద నిఘా వేసిన పోలీసులు

చెన్నై, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పుదుకోట జిల్లా గంధర్వకోట సమీపంలో ఎస్సీ, ఎస్టీలు అధికంగా నివసించే సంగనవిడుది ప్రాంతంలోని వాటర్ ట్యాంక్‌లో గుర్తు తెలియని వ్యక్తులు పేడనీరు కలపటంతో ఆ గ్రామంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. స్థానికుల ఫిర్యాదు మేరకు ఈ సంఘటనపై గంధర్వకోట బీడీవో, ఇతర అధికారులు హుటాహుటిన ఆ గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. వాటర్ ట్యాంక్‌లో నీటి నమూనాలు సేకరించి పరీక్ష నిమిత్తం ప్రయోగశాలకు పంపారు. ఈ జిల్లాలోనే ఎస్సీఎస్టీలు అధికంగా నివసించే వైంగైవయల్ గ్రామంలోని వాటర్ ట్యాంక్‌లో 2022 డిసెంబర్ 26న గుర్తు తెలియని వ్యక్తులు మలమూత్రాలను కలిపిన సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర సంచలనం కలిగించింది. ఆ సంఘటనకు సంబంధించి దోషులను గుర్తించేందుకు సీబీసీఐడీ చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. ఈ నేపథ్యంలో అదే జిల్లాలో ఎస్సీఎస్టీ ప్రజలు ఉపయోగించే వాటర్ ట్యాంక్‌లో పేడనీళ్లు కలిపిన సంఘటన కారణంగా ఆ గ్రామంలో పోలీసులు నిఘా వేస్తున్నారు.

ఎండిన వీరాణం చెరువు


వీరాణం చెరువు ప్రాంతంలో క్రికెట్ ఆడుతున్న బాలురు

చెన్నై, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లాలోని అతిపెద్దదైన వీరాణం చెరువు ఎండ తీవ్రత కారణంగా పూర్తిగా ఎండిపోయింది. 1465 టీఎంసీల సామర్థ్యం, 15 చదరపు మైళ్ల విస్తీర్ణం కలిగిన వీరాణం చెరువు నుంచి పరిసర ప్రాంతాలకు సాగునీరు, చెన్నై నగరానికి తాగునీటిని సరఫరా చేస్తారు. ప్రస్తుతం నెల రోజులుగా ఆ చెరువులో నీటిమట్టం క్రమంగా తగ్గుతూ వచ్చింది. రెండు రోజుల క్రితం నీరడుగంటింది. దీంతో చెరువు పచ్చటి మైదానంలా తయారైంది. ఆ చెరువులో బాలురు క్రికెట్ ఆడుతున్నారు. ఇదిలా ఉండగా వీరాణం చెరువు పూర్తిగా ఎండిపోవటంతో పూడిక పనులకు ఇదే అనువైన సమయమని, ఆలస్యం చేయకుండా ప్రజాపనులు, ఇరిగేషన్ శాఖ అధికారులు పూడిక తీయించాలని స్థానిక రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

సారా ఊట ధ్వంసం


అల్లేరి కొండల్లో సారా ఊట ధ్వంసం చేస్తున్న పోలీసులు

వేలూరు, ఏప్రిల్ 26: జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు చేసి సారా ఊట ధ్వంసం చేశారు. వేపంకుప్పం కొండ ప్రాంతంలో సీఐ నాగరాజ్ నేతృత్వంలో తనిఖీలు చేపట్టిన సిబ్బంది, ఆ ప్రాంతం లో 60 లీటర్ల సారా ఊట, 200 కిలోల బెల్లం స్వాధీనం చేసుకొని, ఆనైకట్టుకు చెందిన వెంకటేశన్, శివశక్తిలను అరెస్ట్ చేశారు. అలాగే, అల్లేరి కొండ ప్రాంతంలో ఇన్‌స్పెక్టర్ మురళీధరన్ నేతృత్వంలో తనిఖీలు చేపట్టిన పోలీసులు, 120 లీటర్ల సారా ఊట గుర్తించి ధ్వంసం చేశారు.

రీల్స్ తీస్తున్న భార్య చేయి నరికిన భర్త


చేయి నరికిన దృశ్యం - నిందితుడు శేఖర్

వేలూరు, ఏప్రిల్ 26: ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసేందుకు రీల్స్ తీస్తున్న భార్య చేతిని నరికిన ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. గుడియాత్తం పిచ్చనూర్‌పేటకు చెందిన శేఖర్ (41)రేవతి (35) దంపతులకు ముగ్గురు కుమార్తెలున్నారు. ఇద్దరు కుమార్తెలకు వివాహం కాగా, మూడో కుమార్తె పాఠశాలలో చదువుకుంటోంది. కొద్దికాలంగా రేవతి ఎక్కువగా వాట్సా‌ప్‌లో ఉండడంతో భర్త దానిని ఖండించినట్లు సమాచారం. ఈ క్రమంలో, గురువారం రాత్రి రేవతి రీల్స్ తీసే పనిలో ఉండగా, శేఖర్ తనకు మద్యంలోకి నీరు కావాలని అడిగినట్లు తెలిసింది. దీంతో, ఇద్దరి మధ్య చెలరేగిన వాగ్వాదంతో ఆగ్రహం చెందిన శేఖర్ కత్తితో భార్య కుడిచేయి నరికాడు. ఆమె కేకలకు చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకొని గాయంతో ఉన్న రేవతిని గుడియాత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఆమెను వేలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై గుడియాత్తం పోలీసులు కేసు నమోదుచేసి శేఖర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ప్రొఫెసర్ నిర్మలాదేవి కేసు తీర్పు వాయిదా

ప్యారీస్, ఏప్రిల్ 26: విద్యార్థినులను తప్పుడు మార్గంలోకి నెట్టిన వ్యవహారంలో అరుప్పుకోటకు చెందిన ప్రొఫెసర్ నిర్మలాదేవి కేసు తీర్పు తేది ప్రకటించకుండా వాయిదా పడింది. అరుప్పుకోటలోని ఓ ప్రైవేటు కళాశాల ప్రొఫెసర్ నిర్మలాదేవి విద్యార్థినులను తప్పుడు మార్గంలోకి నెట్టేందుకు యత్నించారనే ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఆమెను అరెస్ట్‌చేశారు. ఆమెకు సహకరించిన మదురై కామరాజర్ వర్సిటీ ప్రొఫెసర్ మురుగన్, పరిశోధన విద్యార్థి కరుప్పుస్వామిలను కూడా అరెస్ట్ చేసి కోర్టు ఉత్తర్వుల మేరకు జైలుకు తరలించారు. 2018లో జరిగిన ఈ కేసు విచారణ సీబీసీఐడీ చేపట్టగా, అదే సమయంలో శ్రీ విల్లిపుత్తూర్ మహిళా కోర్టులో విచారణ జరిగింది. ఈ కేసుతో సంబంధాలున్న సాక్షుల విచారణ ముగిసిన నేపథ్యంలో, శుక్రవారం తీర్పు వెలువరించనున్నట్లు ప్రకటించారు. నిర్మలాదేవి మినహా మిగతా ఇద్దరు కోర్టులో విచారణకు హాజరయ్యారు. అందువల్ల ఈ నెల 29న తీర్పు వెల్లడించనున్నట్లు న్యాయమూర్తి భగవతి అమ్మాళ్ ప్రకటించారు.

బిట్రగుంట - చెన్నై రైళ్ల రద్దు

పెరంబూర్, ఏప్రిల్ 26: విజయవాడ మార్గంలో మరమ్మతుల కారణంగా బిట్రగుంట-చెన్నై-బిట్రగుంట (17237 / 17238) రైళ్లు ఈ నెల 29,30, ఏప్రిల్ 1, 2, 3, 6, 7, 8, 9, 10, 13, 14, 15, 16, 17, 20, 21, 22, 23, 24 తేదీల్లో రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

ఆకతాయి చేష్టలు....

శునకానికి పులిలా వేషం ● పుదుచ్చేరిలో భీతిల్లిన జనం



పుదుచ్చేరి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి లాస్‌పేట కురింజినగర్ ప్రాంతంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం వేకువజాము వరకూ పులి సంచరిస్తున్నట్లు సమాచారం అందటంతో స్థానికులు భీతిల్లారు. సమీప ప్రాంతాల్లో చిట్టడవులు కూడా లేని తమ ప్రాంతంలో ఆ పులి ఎక్కడి నుంచి వచ్చిందో అని అందరూ ఆశ్చర్యపోయారు. నిజానికి ఆ ప్రాంతంలో పులి వచ్చిందా అని అటవీ శాఖ అధికారులు ఆరా తీయగా నిజం తెలిసి అంతా నవ్వుకున్నారు. రాత్రంతా కురింజనగర్ వాసులకు కళ్లమీద కునుకు పడకుండా చేసింది పులి కాదని, పులిలా ఉన్న శునకమని కనుగొన్నారు. తుంటరి కుర్రాళ్లెవరో శునకానికి అచ్చు పులిలాగే కనిపించేలా పెయింట్ వేయడంతో అది పులిలా కనిపించింది. ఆ శునకం కురింజనగర్ ప్రాంతంలో కనీసం మొరగకుండా తిరగడంతో దానిని స్థానికులు పులిగా భ్రమించి భయపడినట్లు అధికారులు చెప్పారు. ప్రస్తుతం పులివేషంలో ఉన్న ఆ శునకాన్ని చూసి స్థానికులు నవ్వుకుంటున్నారు. ఆ శునకానికి పులివేషం వేసిన దుండగులను కనుగొనేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

తిరువణ్ణామలై వరకు చెన్నై-వేలూరు విద్యుత్ రైలు

● మే 2 నుంచి అమలు

ప్యారీస్, ఏప్రిల్ 26: చెన్నై బీచ్ రైల్వేస్టేషన్ నుంచి వేలూరు వరకు నడుపుతున్న విద్యుత్ రైలును మే 2వ తేది నుంచి తిరువణ్ణామలై వరకు పొడిగిస్తున్నట్లు దక్షిణ రైల్వే శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. ఆ మేరకు, చెన్నై నుంచి ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు బయల్దేరి అర్ధరాత్రి 12.05 గంటలకు తిరువణ్ణామలై చేరుకుంటుంది. మరుసటిరోజు నుంచి ఈ రైలు తెల్లవారుజామున 4 గంటలకు తిరువణ్ణామలై నుంచి బయల్దేరి ఉదయం 5.45 గంటలకు వేలూరు కంటోన్మెంట్‌కు చేరుకుంటుంది. అక్కడి నుంచి 6 గంటలకు బయల్దేరి 9.50 గంటలకు చెన్నై చేరుకుంటుంది. తిరువణ్ణామలై నుంచి వేలూరుకు వచ్చే మార్గంలో పెన్నాత్తూర్, కన్నమంగళం, ఒండ్రుపురం, సేదారంపట్టు, ఆరణి రోడ్డు, మడిమంగళం, పోలూర్ రైల్వేస్టేషన్లలో ఆగి వెళుతుంది.

రాశిపురం నేతికి భౌగోళిక గుర్తింపు

ప్యారీస్, ఏప్రిల్ 26: రాశిపురంలో రుచి, నాణ్యతతో తయారుచేస్తున్న నెయ్యికి భౌగోళిక గుర్తింపు కలిగింది. ఒక ప్రాంతంలో తయారుచేసే, పండించే వస్తువులకు దాని నాణ్యత, ఉత్పత్తి అంశాలు పరిశీలించి జీఐ అనే భౌగోళిక గుర్తింపును కేంద్ర ప్రభుత్వ వాణిజ్య మంత్రిత్వ శాఖ ఆధీనంలో పనిచేస్తున్న సంస్థ పంపిణీ చేస్తుంది. ఆ రీతిలో రాష్ట్రంలో ఇప్పటి వరకు 54 వస్తువులకు ఈ గుర్తింపు వచ్చింది. ఈ నేపథ్యంలో, నామక్కల్ జిల్లా రాశిపురంలో తయారవుతున్న నెయ్యికి భౌగోళిక గుర్తింపు దక్కింది. కొల్లిమలై పర్వతాలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో పాడి పశువులను పోషిస్తున్న రైతుల నుంచి కొనుగోలు చేసే పాల ద్వారా వెన్న, నెయ్యి తదితరాల తయారీలో రాశిపురం అగ్రస్థానంలో ఉంది. వంటలు, మందుల తయారీకి అవసరమైన ఆవు నెయ్యి తయారుచేయడంలో రాశిపురానికి ఈ అరుదైన గుర్తింపు లభించింది.

నగరంలో 188 చలివేంద్రాలు

పెరంబూర్, ఏప్రిల్ 26: నగరంలోని 188 ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటయ్యాయి. నగరంలో కొద్దిరోజులుగా ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. ప్రజల దాహార్తి తీర్చేలా రాజకీయ పార్టీలు చలివేంద్రాలు ఏర్పాటుచేస్తుంటాయి. కానీ, రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ఏ రాజకీయ పార్టీ చలివేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించలేదు. దీంతో, ఎండల్లో వెళ్లే ప్రజలు, వాహనచోదకులు దుకాణాల్లో నగదు వెచ్చించి తాగునీరు కొనుగోలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్, చెన్నై మెట్రోవాటర్ బోర్డు సంయుక్తంగా నగరంలోని 188 ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటుచేసినట్లు అధికారులు తెలిపారు.

ధన్వంతరీ పీఠంలో లక్షార్చన


ధన్వంతరీ పీఠాధిపతి మురళీధరస్వామి

వేలూరు, ఏప్రిల్ 26: స్థానిక వాలాజా పేటలోని ధన్వంతరీ పీఠంలో లక్షార్చన, గురుపెయర్చి యాగం శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమం మే 1వ తేది వరకు జరుగనుంది. ఈ విషయమై పీఠాధిపతి మురళీధరస్వామి మాట్లాడుతూ.... ఈ ఏడాది గురుపెయర్చి మే 1వ తేది బుధవారం రానుందన్నారు. గురు భగవానుడు మేష రాశి నుంచి వృషభ రాశిలోని వెళతారని తెలిపారు. ఈ పెయర్చిలో ముఖ్యంగా పరిహారాలు చేసుకోవాల్సిన రాశులు వృషభం, మిథునం, సింహం, తులం, ధనుస్సు, మీనం మొదలైన రాశులు కలిగిన వారు, గురుభక్తి, గురు దశ జరుగుతున్న వారు అశుభ ఫలములు రాకుండా ఉండేందుకు, దక్షిణామూర్తికి లక్షార్చన, గురుపెయర్చి యాగం చేపట్టామన్నారు. ఈ యాగంలో పాల్గొనేందుకు రూ.500 చెల్లించాలని మురళీధరస్వామి తెలిపారు. వివరాలకు 9443330203 అనే నెంబరు సంప్రదించాలని కోరారు.

కరాటే శిక్షణ ప్రారంభం


కరాటే శిక్షణ ఇస్తున్న మాస్టర్ నాథన్

వేలూరు, ఏప్రిల్ 26: స్థానిక వేలప్పాడి పూందోట్టం వళ్లలార్ మాధ్యమిక పాఠశాలలో వేసవి కరాటే శిక్షణ ప్రారంభమైంది. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటలకు ఈ శిక్షణ జరుగుతుందని కరాటే మాస్టర్ నాథన్ తెలిపారు. ఈ శిక్షణలో తమ పిల్లలను చేర్చాలనుకునే తల్లిదండ్రులు 9942260247 అనే నెంబరులో సంప్రదించి పేరు నమోదుచేసుకోవాలని ఆయన తెలిపారు.

అన్నాడీఎంకే ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రం ప్రారంభిస్తున్న అన్నాడీఎంకే నేత ఎస్సార్కే అప్పు

వేలూరు, ఏప్రిల్ 26: వేలూరు కార్పొరేషన్ జిల్లా అన్నాడీఎంకే యువజన విభాగం ఆధ్వర్యంలో స్థానిక బీడీవో కార్యాలయం సమీపంలో చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో వీపీఎం కుమార్, కార్యదర్శి ఎస్సార్కే అప్పు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు మజ్జిగ, పుచ్చకాయలు, కీర దోసకాయలు, జ్యూస్ అందించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువకుడి హత్యకేసులో ఏడుగురికి యావజ్జీవశిక్ష

ప్యారీస్, ఏప్రిల్ 26: విరుదునగర్ జిల్లా శివకాశి సమీపంలోని సేనాపురం కాలనీకి చెందిన యువకుడి హత్యకేసులో న్యాయస్థానం ఏడుగురికి యావజ్జీవ జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. సేనాపురం కాలనీకి చెందిన అరవింద్ (28)పై రెండు హత్యాకేసులు పెండింగ్‌లో ఉన్నాయి. 2022 మార్చి 30వ తేది అరవింద్ తన మిత్రుడు పాండ్యన్‌తో కలసి బైక్‌లో వెళ్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు మారణాయుధాలతో వారిపై దాడిచేయడంతో అరవింద్ సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. ఈ కేసుకు సంబంధించి అరుణ్‌పాండి, పార్తీపన్, ముత్తుకృష్ణన్, పాండ్యరాజన్, మహేశ్వరన్ సహా ఏడుగురిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. కేసు విచారణ ముగిసిన నేపథ్యంలో, శుక్రవారం న్యాయమూర్తి జయకుమార్ నిందితులు ఏడుగురికి యావజ్జీవ జైలుశిక్షతో పాటు తలా రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

బస్టాండ్‌లో ఆగని బస్సులపై ఫిర్యాదుకు ప్రత్యేక నెంబరు

పెరంబూర్, ఏప్రిల్ 26: నగరంలోని బస్టాండుల్లో ఆగకుండా వెళ్లే ఎంటీసీ బస్సులపై ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక నెంబరు పరిచయం చేశారు. మెట్రో ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) నగరం, శివారు ప్రాంతాలకు బస్సులు నడుపుతుండగా, ప్రతిరోజు వేలాది మంది ప్రయాణిస్తుంటారు. ప్రస్తుతం సాధారణ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించే సదుపాయాన్ని డీఎంకే ప్రభుత్వం కల్పించింది. ఈ నేపథ్యంలో, ఎంటీసీ బస్సులు బస్టాండ్లలో నిలుపకుండా వెళ్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎంటీసీ అధికారులకు ఫిర్యాదులందాయి. దీనిపై స్పందించిన ఎంటీసీ, బస్టాండ్ ప్రాంతాల్లో ఆగకుండా వెళ్లే బస్సులపై '149' అనే నెంబరుకు ఫిర్యాదు చేయాలని సూచించింది. ఫిర్యాదులో బస్సు నెంబరు ఉండాలని అధికారులు తెలియజేశారు.

ప్రగతి వైపు విద్యార్థులను నడిపించి, దిశా నిర్దేశం చేసి దేశానికి ఉపయోగపడే శక్తిగా మలిచిన గురువులెందరో చరిత్రలో ఉన్నారు. గురువు తన విధిని నిష్ఠగా, అంకితభావంతో నిర్వర్తిస్తే విద్యార్థులు ఉత్తమపౌరులుగా రూపొంది దేశాన్ని అభ్యుదయ పథంలో నడిపించగల సామర్థ్యాన్ని సొంతం చేసుకుంటారు. చదువుకున్న విద్యాసంస్థలోనే చదువు చెప్పే స్థాయికి ఎదిగి, చదువు నేర్పే పదవి పొందే అదృష్టం ఏ కొందరికో లభిస్తుంది. అంతేకాదు. పరవస్తు చిన్నయసూరి, కందుకూరి వంటి మహనీయులు పనిచేసిన ఆ ప్రతిష్ఠాత్మక కళాశాలలో ఆచార్యులుగా పనిచేసే అవకాశం పొందడం అరుదైన వరం. ఆ వరాన్ని స్వంతం చేసుకున్న ఆమె డా.ఎన్.ఎలిజబెత్ జయకుమారి నేటి మన 'తరుణి'. ఉపాధ్యాయినిగా ఆమె అంతరంగ ఆవిష్కరణ ఈనాటి 'తరుణి'లో....

- వేళచ్చేరి

తరుణి

నిబద్ధతే కొలమానంగా...

బోధనే పరమావధిగా

- చదివిన కళాశాలలో అధ్యాపకురాలిగా ఉద్యోగం
- ప్రెసిడెన్సీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షురాలు

ఎన్.ఎలిజబెత్ జయకుమారి


డాక్టర్ ఎన్.ఎలిజబెత్ జయకుమారి

నారిపటి ఎలిజబెత్ జయకుమారి పుట్టింది ఆంధ్రప్రదేశ్‌లోని 'పొన్నూరు'లో. ఇవాంజెలిన్, జయదాసు ఆమె తల్లిదండ్రులు. ఎలిజబెత్ విద్యాభ్యాసమంతా చెన్నైలోనే జరిగింది. బెంటిక్ హయ్యర్ సెకండరీ స్కూలులో 10వ తరగతి వరకు చదివి, ఆపై ఎగ్మూర్‌లోని ప్రెసిడెన్సీ బాలికల హయ్యర్ సెకండరీ స్కూలులో ఇంటర్ చదివారు. క్వీన్ మేరీస్ కాలేజీలో బి.ఏ ప్రథమస్థాయిలో ఉత్తీర్ణులయ్యారు. ప్రెసిడెన్సీ కాలేజీ నుంచి ఎంఏ 'టాపర్'గా నిలిచారు. అక్కడే ఎంఫిల్ చేసిన ఎలిజబెత్ ఆపై 'భాస్కర రామాయణం...నామరూప విజ్ఞానం' అనే అంశంపై పీహెచ్‌డీ చేశారు

పత్ర సమర్పణ...

డా.ఎలిజబెత్ సెమినార్లు ఎన్నింటిలోనో పత్ర సమర్పణ చేశారు. వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, నెల్లూరులోని సింహపురి విశ్వవిద్యాలయం, కడపలోని యోగి వేమన విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని సెంట్రల్ యూనివర్సిటీ మొదలైన చోట్ల ఎలిజబెత్ వివిధ అంశాలపై పత్రాలు సమర్పించారు.

గైడ్‌గా... : 2013వ సంవత్సరం నుంచి ఎలిజబెత్ ఎమ్.ఫిల్ విద్యార్థులకు గైడ్‌గా మార్గనిర్దేశం చేస్తున్నారు. 11 మంది విద్యార్థులు ఆమె దగ్గర ఎం.ఫిల్ చేశారు. 2014వ సంవత్సరం నుంచి పీహెచ్‌డీ విద్యార్థులకు గైడ్‌గా ఉన్న ఎలిజబెత్ దగ్గర ఐదుగురు పీహెచ్‌డీ పట్టాలనందుకున్నారు. ఇంకా ముగ్గురు విద్యార్థులు పరిశోధన చేస్తున్నారు.


భర్త మనోజ్‌కుమార్‌తో...

రచయిత్రిగా...

'ప్రజా మణిపూస', 'భావ వీణ' మొదలైన పత్రికల్లో ఆమె రాసిన సాహిత్య వ్యాసాలు ప్రచురితమయ్యాయి. డా.ఎల్బీ శంకరరావుతో కలసి 'పద్యరత్నాలు' సంకలనం ప్రచురించారు. 30కి పైగా సాహిత్యానికి సంబంధించిన ప్రసంగాలు చెన్నై ఆకాశవాణి ద్వారా ప్రసారమయ్యాయి.

పునశ్చరణ తరగతులు...

అవసరానుగుణంగా పునశ్చరణ తరగతులకు హాజరుకావడం గురువు కెంతో కీలకమైనది. బోధనా సిబ్బంది ఎప్పటికప్పుడు తమ విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నదని ఎలిజబెత్ గాఢంగా విశ్వసిస్తారు. అందుకే ఆమె ఎన్నో పునశ్చరణ తరగతులకు హాజరై తన జ్ఞానానికి పదును పెట్టుకున్నారు. ఉపాధ్యాయుడు నిత్యవిద్యార్థిగా ఉంటేనే విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం ఇవ్వగలరన్న దానికి నిరూపణ ఎలిజబెత్.

ఉద్యోగ జీవితం...

చదువు పూర్తయిన వెంటనే జర్నలిస్టుగా ఓ తెలుగు దినపత్రికలో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు ఎలిజబెత్. అర్హతలకు తగిన ఉద్యోగం కాకపోయినా, పనిచేస్తున్న కాలంలో జర్నలిజంకు సంబంధించిన ఎన్నో విషయాలను ఆకళింపు చేసుకుని అనుభవం గడించారు. విశాల దృక్పథం పెంపొందించుకొనడంతో బాటు నలుగురితో కలసి ధైర్యంగా మెలగడం నేర్చుకున్నారు. ఆ తరువాత ఒక క్రైస్తవ సంస్థలో అనువాదకురాలిగా పనిచేసి తమిళం నుంచి తెలుగుకు అనువదిస్తూ, అనువాద రచనల్లో స్వయం పాఠాలు నేర్చుకున్నారు. మద్రాసు విశ్వవిద్యాలయంలో గెస్ట్ లెక్చరర్‌గా మూడేళ్ల పాటు పనిచేశారు. ఆ తర్వాత తను చదువుకున్న కాలేజీలోనే అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహించారు. ప్రస్తుతం ప్రెసిడెన్సీ కళాశాలలో తెలుగు శాఖ అధ్యక్షురాలిగా సేవలందిస్తున్నారు.

అవార్డులు... : డాక్టర్ ఎలిజబెత్ 'బెస్ట్ టీచర్' అవార్డు, 'గుడ్ స్పీకర్' అవార్డు, ఇంకా ఎన్నో తెలుగు సంఘాల ద్వారా సన్మానాలు పొందారు. 'జనని', 'వేద విజ్ఞాన వేదిక' మొదలైన తెలుగు సంఘాల సాహిత్య సభల్లో ప్రసంగించారు. ఎలిజబెత్ జీవన సహచరుడు మనోజ్‌కుమార్ ఎయిర్ ఇండియాలో పనిచేస్తున్నారు.

వ్యక్తిత్వం...

బాల్యం నుంచి కూడా ఎలిజబెత్ వాగ్ధాటిలో మిన్న. పాఠశాల స్థాయి నుండే ఎన్నో వక్తృత్వ పోటీల్లో పాల్గొని బహుమతులు గెలుచుకున్నారు. నిరంతరం నూతన విషయాలను నేర్చుకోవాలన్న ఆమె జిజ్ఞాస ఆమెను మంచి గురువుగా తీర్చిదిద్దింది. క్రమశిక్షణ, నిజాయితీ, నిబద్ధత, నైతికవిలువలు కలిగిన ఉపాధ్యాయినిగా, తన వృత్తి ధర్మాన్ని త్రికరణశుద్ధిగా నెరవేర్చాలన్న దృఢ సంకల్పం ఆమెది. బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించినప్పుడే ఆత్మ సంతృప్తి కలుగుతుందని ఆమె విశ్వాసం. శిష్యుల ఎదుగుదలే గురుదక్షిణ అని ఆమె భావన.


మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందినప్పటి చిత్రం

"నిరంతరం నేర్చుకొనే ఉపాధ్యాయుడే మంచి విద్యావంతులను తయారుచెయ్యగలడు. అందుకే ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు తమ నైపుణ్యాలను మెరుగుపరచుకుంటూ ఉండాలి. విద్యార్థులు క్రమశిక్షణతో, గురువు పట్ల భయభక్తులతో మెలగాలి. విద్యార్థులు ముఖ్యంగా నైతిక విలువలను పెంపొందించుకోవాలి. అప్పుడే వారు సక్రమ మార్గంలో ప్రయాణించేందుకు అవకాశం కలుగుతుంది. 'కష్టే ఫలి' అన్నట్లు విద్యార్థులు కష్టపడి చదివితేనే తగిన ఫలితం పొందుతారు. వారి గమ్యాన్ని చేరుకుంటారు" అని డా.ఎన్.ఎలిజబెత్ జయకుమారి 'తరుణి'తో తన అనుభవాలు పంచుకున్నారు.


ఉత్సవ శాంతి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

జలకంఠేశ్వరాలయంలో శాంతి అభిషేక పూజలు

వేలూరు, ఏప్రిల్ 26: వేలూరు బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జలకంఠేశ్వరాలయంలో ఉత్సవ శాంతి అభిషేకాలు నిర్వహించారు. ప్రజలంతా క్షేమంగా ఉండాలని, వర్షాలు కురవాలని ప్రార్థిస్తూ ప్రతి ఏడాది బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహిస్తుంటారు. ఈ నేపథ్యంలో, శుక్రవారం జరిగిన కార్యక్రమానికి సంఘ అధ్యక్షుడు రాజ అధ్యక్షత వహించగా, జనరల్ సెక్రటరీ జయకుమార్, అడ్వయిజర్లు సత్యమూర్తి, బాలసుబ్రమణ్యం, ఆర్గనైజర్లు కృష్ణమూర్తి, సుబ్రమణి, థామస్, రాష్ట్ర ఉప కార్యదర్శి కృష్ణమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వర పూజతో ప్రారంభించి పూజలు, హోమాలు చేసి మహా దీపారాధన నిర్వహించారు.

సాలిగ్రామంలో పద్మం వెజ్ రెస్టారెంట్ ప్రారంభం



హోటల్‌ను ప్రారంభించిన ప్రముఖ సినీదర్శకుడు కేఎస్ రవికుమార్‌కు జ్ఞాపిక అందజేస్తున్న పద్మం గ్రూప్ ఆఫ్ హోటల్స్ నిర్వాహకురాలు

చెన్నై, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సాలిగ్రామం కావేరి వీధిలో అన్ని హంగులతో ఏర్పాటుచేసిన పద్మం వెజ్ రెస్టారెంట్‌ను ప్రముఖ సినీ దర్శకుడు కేఎస్ రవికుమార్ శుక్రవారం ప్రారంభించారు. పద్మం గ్రూప్‌ఆఫ్ హోటల్స్ టి.నగర్ వెంకటనారాయణ రోడ్డులో మొదటి వెజ్ రెస్టారెంట్‌ను విజయవంతంగా నడుపుతోంది. ఈ నేపథ్యంలో రెండో శాఖాహార రెస్టారెంట్‌ను సినీ రంగ కళాకారులు, స్టూడియో నిర్వాహకులు, కార్మికులు, వ్యాపారులు అత్యధిక సంఖ్యలో నివసిస్తున్న సాలిగ్రామంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా దర్శకుడు కేఎస్ రవికుమార్ మీడియాతో మాట్లాడుతూ... మల్టీ స్టూడియోలకు నిలయమైన సాలిగ్రామం పరిసర ప్రాంతాల్లో కొత్తగా పద్మం వెజ్ రెస్టారెంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం నగరవాసులంతా ఆరోగ్యానికి శాఖాహార వంటలే శ్రేయస్కరమనే భావనతో ఉన్నారని, అలాంటివారికి ఈ రెస్టారెంట్ చక్కటి, రుచికరమైన దక్షిణభారత వంటకాలను అందిస్తుందని చెప్పారు. ఈ రెస్టారెంట్‌లో వెజ్ ఇడియాప్ప బిర్యానీ, ఆంధ్రప్రదేశ్‌లో పేరొందిన ఎమ్మెల్యే పెసరట్టు కూడా లభిస్తుందని పద్మం గ్రూప్ ఆఫ్ హోటల్స్ నిర్వాహకురాలు పేర్కొన్నారు. త్వరలో రాష్ట్రమంతటా మరిన్ని శాఖలను ప్రారంభించనున్నట్లు ఆమె తెలిపారు.

'మెట్రో' సత్య హీరోగా 'రాబర్'


ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేసిన శివకార్తికేయన్

'మెట్రో' సత్య హీరోగా తెరకెక్కిన కొత్త చిత్రం 'రాబర్'. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను హీరో శివకార్తికేయన్ శుక్రవారం రిలీజ్ చేశారు. చెన్నై నగరంలో జరిగిన ఒక యదార్థ సంఘటనను నేపథ్యంగా చేసుకుని ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. 'మెట్రో' ఫేం ఆనంద్ కృష్ణన్ కథ, స్క్రీన్‌ప్లే సమకూర్చగా, ఎం.పాండి దర్శకత్వం వహించారు. ఇంప్రెస్ ఫిల్మ్ పతాకంపై సీనియర్ జర్నలిస్ట్ ఎస్.కవిత ఈ చిత్రాన్ని నిర్మించారు. చిత్ర నిర్మాణంలో మెట్రో ప్రొడక్షన్స్ ఆనంద్ కృష్ణన్ కూడా పాలు పంచుకున్నారు. ఇతర పాత్రల్లో దీపా శంకర్, జయప్రకాష్, సెన్‌రాయన్, డేనీ పోప్ తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా ఎన్ఎస్. ఉదయకుమార్, సంగీతం జోహన్ శివగణేశ్. నిర్మాత కవిత మాట్లాడుతూ, 'ఒక యదార్థ ఘటన ఆధారంగా తెరకెక్కించడంతో ఇందులోని సన్నివేశాలు వాస్తవానికి ఎంతో దగ్గరగా ఉంటాయి. చిత్రీకరణ కూడా నగరంలోని టి.నగర్, వేళచ్చేరి, సెమ్మంజేరి, ఈసీఆర్, పాత మహాబలిపురం వంటి పలు ప్రాంతాల్లోనే పూర్తిచేశాం. ఈ సినిమాలోని విజువల్స్ సహజత్వానికి ఎంతో దగ్గరగా ఉంటాయి. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను హీరో శివకార్తికేయన్ చేతుల మీదుగా రిలీజ్ చేశాం. మే నెలాఖరులో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని తెలిపారు. దర్శకుడు పాండి మాట్లాడుతూ, 'హీరో అత్యాశ ఒక పిచ్చిగా మారుతుంది. అతడు ఎంచుకున్న మార్గం దొంగగా మారుస్తుంది. ఆ తర్వాత అతని జీవితాన్ని ఎలా ప్రభావితం చేసిందన్నదే' ఈ చిత్ర కథ' అని పేర్కొన్నారు.


'రాయన్'లో ధనుష్ తదితరులు

జూలైలో 'రాయన్'గా వస్తున్న ధనుష్?

ధనుష్ హీరోగా నటిస్తున్న 50వ చిత్రానికి 'రాయన్' అనే పేరు ఖరారు చేయగా, ఈ చిత్రాన్ని జూలైలో విడుదల చేసేందుకు నిర్మాణ సంస్థ సన్నాహాలు చేస్తుంది. ఇందులో ధనుష్ హీరోగా నటిస్తూనే దర్శకత్వ బాధ్యతలు కూడా చేపట్టారు. ఏఆర్.రెహ్మాన్ సంగీతం అందించే ఈ సినిమాలో ఎస్‌జే సూర్య, సందీప్ కిషన్, కాళిదాస్ జయరాం, సెల్వరాఘవన్, ప్రకాష్ రాజ్, తుషార విజయన్, అపర్ణ బాలమురళి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుని, గత కొన్ని రోజులుగా పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులు జరుపుకుంటుంది. అయితే, ఈ చిత్రాన్ని మొదట జూన్ నెలలో రిలీజ్ చేయాలని ప్లాన్ చేసినప్పటికీ ఆ నెలలోనే కమల్ హాసన్ 'ఇండియన్-2', ప్రభాస్ 'కల్కి ఏడీ 2898' వంటి భారీ బడ్జెట్ చిత్రాలు విడుదలకు సిద్ధంగా ఉండడంతో 'రాయన్' చిత్రాన్ని జూలై రెండో వారంలో విడుదల చేయాలని భావిస్తున్నారు.

'వడక్కన్' ఫస్ట్‌లుక్ రిలీజ్ చేసిన లింగుస్వామి

చిత్రజ్యోతి

ప్రముఖ రచయిత భాస్కర్ శక్తి దర్శకుడిగా పరిచయమవుతూ రూపొందిస్తున్న చిత్రం 'వడక్కన్'. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను తాజాగా ప్రముఖ దర్శకుడు ఎన్.లింగుస్వామి తన ఎక్స్ హ్యాండిల్ వేదికగా ఆవిష్కరించారు. 'వెన్నిలా కబడి కుళు', 'ఎండన్ మగన్', 'నాన్ మహాన్ అల్ల', 'పాండియ నాడు' వంటి పలు చిత్రాలకు మాటలు, కథ సమకూర్చిన భాస్కర్ శక్తి తొలిసారి మెగాఫోన్ పట్టారు. డిస్కవరీ సినిమాస్ పతాకంపై ఎం.వేడియప్పన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు కుంకుమం రాజ్ హీరోగా, వైరమాల హీరోయిన్‌గా నటించగా కర్నాటక సంగీత కళాకారులు ఎస్‌జే జనని ఈ సినిమాకు సంగీత స్వరాలు అందిస్తుండగా, ఎన్.లింగుస్వామికి చెందిన తిరుపతి బ్రదర్స్ పతాకంపై తెరకెక్కించారు. రాష్ట్రంలోనివలస కార్మికుల జీవితాను ఇతివృత్తంగా చేసుకుని హాస్యం జోడించి తెరకెక్కిస్తున్నారు.


'వడక్కన్' ఫస్ట్‌లుక్



చెన్నై చేరుకున్న
ఎంఎస్ డీలక్స్ నౌక

ఐసిఎఫ్, ఏప్రిల్ 26: చెన్నై హార్బర్‌కు ఎంఎస్ ది వరల్డ్ డీలక్స్ నౌక వచ్చి చేరింది. సెంట్రల్ అమెరికాలో ఉన్న పనామా దేశానికి చెందిన ఈ నౌక 280 మంది సిబ్బంది, 89 మంది ప్రయాణికులతో బుధవారం చెన్నై హార్బర్‌కు వచ్చింది. 12 అంతస్తులు కలిగిన ఈ భారీ నౌకలో 106 ప్రత్యేక గదులు, 19 స్టూడియో క్వార్టర్స్, 40 స్టూడియోలు, 5 హోటళ్లు, ఆరోగ్య స్పా, రిసెప్షన్ హాలు, షోరూమ్, లైబ్రరీ, సినిమా థియేటర్, పెద్ద హాలు, బార్లు, విశ్రాంతి గదులు, స్విమ్మింగ్ పూల్, టెన్నిస్, గోల్ఫ్ క్రీడా మైదానాలు, జిమ్ వంటి సౌకర్యాలున్నాయి. విదేశాల నుంచి వచ్చిన 89 మంది పర్యాటకులు స్థానిక మైలాపూర్, జార్జిటౌన్, మహాబలిపురం, కాంచీపురం వంటి ప్రాంతాలు సందర్శించి, శుక్రవారం విశాఖపట్టణానికి బయల్దేరి వెళ్లినట్లు హార్బర్ అధికారులు తెలిపారు.

ఆలయాల నగరంలో 'గ్రాండ్ మదురై'


మీడియా సమావేశంలో నిర్వాహకులు

చెన్నై, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఆలయాల నగరంలో ప్రసిద్ధి చెందిన మదురైలో జీఆర్‌టీ హోటల్స్ గ్రూపు 'గ్రాండ్ మదురై' పేరుతో ఆధునిక హోటల్‌ను ప్రారంభించింది. ఈ ప్రారంభోత్సవంలో జీఆర్‌టీ హోటల్స్ రిసార్ట్స్' నిర్వహణాధికారి విక్రమ్ కోట తదితరులు పాల్గొన్నారు. విమానాశ్రయ సమీపంలో ఏర్పాటైన ఈ నక్షత్ర హోటల్.. ప్రయాణీకుల అవసరాలకు అనుగుణంగా, ఆధునిక సదుపాయాలతో, వినియోగదారుల హృదయాలను ఆకట్టుకునేలా, 120 గదులతో ఏర్పాటు చేశారు.

సౌందరరాజ పెరుమాళ్
దశావతార వైభవం


దశావతారాల్లో కనువిందు చేస్తున్న తాడికొంబు సౌందరరాజ పెరుమాళ్

చెన్నై, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ సమీపం తాండికొంబు ప్రాంతంలోని సౌందరరాజ పెరుమాళ్ ఆలయంలో చిత్రా పౌర్ణమి బ్రహోత్సవాల్లో భాగంగా మూడు రోజుల క్రితం కుడగనారులో వేంచేసిన స్వామివారు స్వక్షేత్రానికి అశ్వవాహనంపై బయలుదేరారు. మార్గమధ్యంలో వెళ్లై వినాయగర్ ఆలయం సమీపంలోని ప్రైవేటు మహల్‌లో గురువారం రాత్రి వేంచేశారు. అక్కడ సౌరాష్ట్ర మహాజన సభ ఆధ్వర్యంలో ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో స్వామివారు దశావతారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి అవతారానికి ముందు స్వామివారికి ప్రత్యేక పూజలు, దీపారాధన చేశారు. ఈ వేడుకలను తిలకించేందుకు వేలాదిమంది భక్తులు విచ్చేశారు. శుక్రవారం వేకువజాము వరకూ ఈ కార్యక్రమం కొనసాగింది. ఆ తర్వాత స్వామివారి గరుడ వాహనంలో తాండికొంబు క్షేత్రానికి బయలుదేరారు.

కింగ్స్ కార్నర్‌స్టోన్ కాలేజీలో
విదేశీ విద్యావేత్తల బృందం



చెన్నై, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా ముత్తుక్కాడు సమీపంలో వున్న కింగ్స్ కార్నర్‌స్టోన్ ఇంటర్నేషనల్ కాలేజీని యూకేలోని యూనివర్శిటీ ఆఫ్ సండర్లాండ్ ప్రతినిధుల బృందం సందర్శించింది. సెప్టెంబరులో తమ క్యాంపస్‌కు బదిలీ అయ్యే విద్యార్థులతో ఈ బృందం సమావేశమైంది. ఈ సందర్భంగా కింగ్స్ కార్నర్ స్టోన్ ఇంటర్నేషనల్ కాలేజీ ఛైర్మన్ జాన్ క్రిస్టోఫర్ జై శంకర్ మాట్లాడుతూ... తమ కాలేజీలో మొదటి రెండు సంవత్సరాలు పూర్తి చేసిన తరువాత విద్యార్థులు తమ ఆఖరి సంవత్సరాన్ని విదేశాల్లో పూర్తి చేయడానికి సండర్లాండ్ యూనివర్సిటీకి బదిలీ చేయబడతారని తెలిపారు. విదేశాల్లో అధ్యయనం ద్వారా విద్యార్థులకు ఒక వినూత్న పరిష్కారం లభిస్తుందని వివరించారు.

త్వరలో అందుబాటులోకి ముఖద్వార ఫుట్ ఓవర్ బ్రిడ్జి


నేపియర్ బ్రిడ్జి సమీపంలోని ఫుట్ ఓవర్ బ్రిడ్జి

ఐసిఎఫ్, ఏప్రిల్ 26: స్థానిక మెరీనా సముద్రతీరం సమీపంలో ఉన్న నేపియర్ ముఖద్వారం ప్రాంతంలో ప్రజలు సముద్రం అందాలను ఆస్వాదించేలా ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటుచేశారు. ఈ బ్రిడ్జి త్వరలో అందుబాటులోకి రానుంది. చెన్నై ఎన్నూర్ నుంచి మహాబలిపురం వరకు సముద్రతీరాన్ని అభివృద్ధి చేసే పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, నేపియర్ వంతెన ముఖద్వారం ప్రాంతంలో సముద్రాన్ని తిలకించేలా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ప్రారంభించారు. ఇటీవల ఈ పనులు పూర్తికావడంతో మరి కొన్ని రోజుల్లో ప్రజల వినియోగం కోసం ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

పక్షుల శరణాలయంగా తిరువొత్తియూర్ ?

ఐసిఎఫ్, ఏప్రిల్ 26: స్థానిక తిరువొత్తియూర్‌లోని రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న నీటి కుంట పక్షుల శరణాలయంగా మారుతోంది. ఎప్పుడూ నీరు పుష్కలంగా ఉండే ఈ కుంటలో వివిధ రకాల చేపలున్నాయి. వీటి కోసం పెలికాన్ అనే గూడబాతులు, పర్పిల్ మూర్‌హెన్ వంటి వివిధ రకాల పక్షులు ఇక్కడ మకాం వేశాయి. నిర్మానుష్య ప్రదేశం కావడంతో ఈ స్థలాన్ని తమకు ఆవాసంగా ఈ పక్షులు మలుచుకున్నాయి. అక్కడున్న చిత్తడి నేలల్లో గూళ్ల ఏర్పాటుచేసుకుంటున్నాయి.


రైల్వే కుంటలో సేదతీరిన గూడబాతులు

కండువా కప్పేశారు



వైసీపీ కండువాలో పూల ఆనంద్



తిరిగి టీడీపీలో చేరిన పూల ఆనంద్

మామా వైసీపీ కండువా వేసుకో.. గెలిచాక నీకేం కావాలో అడిగి పండగ చేసుకో.. అంటూ తమ క్లాస్మేట్ మెడలో బలవంతంగా బులుగు కండువాను వేసేశారు పాత మిత్రులు. అయితే వారం తిరగకుండానే సదరు వ్యక్తి టీడీపీలో చేరి ఆ పాతమిత్రులను కంగుతినిపించారు. ఇంతకీ ఆయనెవరంటే శ్రీకాళహస్తికి చెందిన పూల ఆనంద్. హైదరాబాదులో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఉన్నారు. టెన్త్‌లో ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు ఈయన క్లాస్మేట్. ఇంటర్‌లో ఎమ్మెల్యే మధుసూదనరెడ్డి బ్యాచ్‌మేట్. అయితే ఈయన మాత్రం తొలి నుంచీ టీడీపీనే. ఒక భూవివాదంలో వారం కిందట అంజూరు శ్రీనివాసులును కలిశారు. ఇక్కడే ఆయన మెడలో బులుగు కండువా పడిపోయింది. అదెలాజరిగిందో ఆయన మాటల్లోనే చదవండి... 'అంజూరు శ్రీనివాసులు ఇంట్లో నేను ఉన్నపుడు అక్కడకి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి వచ్చారు. పాత స్నేహితులం మాట్లాడుకుంటూ ఉండగానే నా మెడలో వైసీపీ కండువా కప్పేశారు. గొడవ పడలేక వచ్చేశాను. అయితే మర్నాడు ఆ ఫోటోను వైరల్ చేశారు. పైగా పార్టీ మారినందుకు నేను రూ.20 లక్షలు తీసుకున్నానని అబద్దాలు ప్రచారం చేశారు." అంటూ ఆయన బొజ్జల సుధీర్ రెడ్డిని కలిసి తాను టీడీపీలోనే ఉన్నానని స్పష్టం చేశారు. స్నేహాన్ని కూడా రాజకీయాల్లోకి ఈడ్చేస్తారా అని శ్రీకాళహస్తి ప్రజలు విస్తుపోయారు.

- శ్రీకాళహస్తి

ఇదీ మందు

అన్యాయం గదా డాక్టర్!

డాక్టర్‌తో ఆ పేషెంట్ గొంతు పెంచి అరుస్తున్నట్టుగా మాట్లాడుతూ ఉంటే ఓపీలో ఉన్నవాళ్లంతా గుమికూడారు. నర్సులు డాక్టర్‌కి రక్షణగా నిలబడ్డారు. 'చూడండి సార్ ఈ అన్యాయం' అని తన సహ పేషెంట్ల వైపు చూశాడు అతను. ఏమైంది అన్నట్టుగా అందరూ ముఖాలు పెట్టారు.

'పేదోళ్లకి ఒక వైద్యం.. పెద్దోళ్లయితే ఇంకో వైద్యం చేస్తే ఎట్ల సార్?' అన్నాడతను అదే గొంతుతో.

జరిగింది ఏమిటంటే.. వారం కిందట అతను బైకుమీద నుంచి పడ్డాడు. నుదుటికి దెబ్బతగిలి బొటబొటా రక్తం కార్చుకుంటూ ఆసుపత్రికి వచ్చాడు. డాక్టర్ తుడిచి నాలుగు కుట్లు వేసి, బ్యాండేజ్ అతికించి వారం తర్వాత రా అని పంపించాడు. వారం తర్వాత వచ్చిన ఆ పేషెంట్ ఇప్పుడు డాక్టర్‌తో గొడవ పడుతున్నాడు.

'చూడండి సార్.. ఇంక బ్యాండేజ్ వద్దు. తీసెయ్ అంటా ఉండాడు ఈ డాక్టర్' అన్నాడతను కంప్లైయినింగ్‌గా..

నీకు మెడకాయమింద తలకాయ ఉండాదా.. గాలి తగిలి గాయం ఆరాల.. బ్యాండేజి అట్నే ఉంటే సెప్టిక్ అయిపోతాది అని గదా సార్ చెప్తావుండేది' అని నర్సు విరుచుకుపడింది.

అతను మాత్రం తగ్గలేదు.

'మరి చిన్న గులకరాయి తగిలితే ఆయప్పకి మాత్రం ఇన్ని రోజులైనా బ్యాండేజీ తీయలేదు ఎందుకు? నేను ఇచ్చేదీ డబ్బులే కదా.. నాకూ వైద్యం అట్నే గదా చెయ్యాల?"అని నుదిటి మీద ఉన్న బ్యాండేజీని తడుముకుంటూ అతను ప్రశ్నించాడు.

డాక్టర్‌కి ఏం జవాబు చెప్పాలో తెలీక బిక్క మొహం వేసుకుని చూశాడు. జనం మాత్రం జగన్‌ను తలచుకుని నవ్వుకుంటూ ఉండిపోయారు.




చిత్తూరు జిల్లా కార్వేటినగరానికి చెందిన మునస్వామి రేటు తక్కువని తన సమీపంలో తమిళనాడు పరిధిలోని పల్లెపట్టు బంకుకు వచ్చి ట్రాక్టరులో డీజిల్ వేయించుకుంటారు. ఆయనే కాదు అక్కడి ద్విచక్ర వాహన చోదకులూ ఇక్కడికే వచ్చి పెట్రోలు కొనుక్కుంటారు. తడ మండల గ్రామాలవారు తమకు దగ్గరగా ఉన్న తమిళనాడు పరిధిలోని ఆరంబాకం, ఎళావురు వెళ్లి బంకుల్లో పెట్రోలు,డీజిల్ వేయించుకుంటారు. కర్ణాటక సరిహద్దులోని ఆంధ్రా వాసులు కూడా తమకు దగ్గరలోని పొరుగు రాష్ట్ర బంకులకే క్యూ కడతారు.

- తిరుపతి(నేరవిభాగం)



పెట్రోలు లీటరు ధర రూ.లలో			
సంవత్సరం	తిరుపతి	తమిళనాడు	కర్ణాటక
2018	75.13	74.93	75.13
2024	109.52	103.88	102.95

డీజిల్ లీటరు ధర రూ.లలో			
సంవత్సరం	తిరుపతి	తమిళనాడు	కర్ణాటక
2018	69.10	69.10	68.92
2024	97.35	92.34	93.18



వ్యాట్ ఈజ్ దిస్ బాదుడు జగనా

- వైసీపీ పాలనలో పెట్రోలు,డీజిల్ ధరలపై అమాంతం వ్యాట్ పన్ను పెంపు
- దేశంలోనే లేని రేట్లతో మోయలేని భారం
- గగ్గోలు పెడుతున్న వాహన యజమానులు

జగన్ గత ఎన్నికల ప్రచార సభల్లో బాదుడే బాదుడు అంటూ విమర్శలు గుప్పించారు. తాను అధికారంలోకి రాగానే ధరలన్నీ కిందకు దించేస్తానని జనాన్ని ఆశల పల్లకిలో ఊరేగించారు. తీరా అధికార పగ్గాలు చేపట్టేక అసలైన బాదుడెలా ఉంటుందో చూపించారు. కేంద్రం ధరలు నిర్ణయించే పెట్రోలు,డీజిల్‌పైనా తన ప్రతాపం చూపించారు. పొరుగు రాష్ట్రాలే నయమనిపించేలా పెంచేశారు. 2022 నుంచి దేశంలోనే ఎక్కడా లేనంతగా రాష్ట్ర వాటా కింద వ్యాట్, రోడ్డు అభివృద్ధి సెస్‌ల పేరుతో అదనపు [illegible] వడ్డనకు దిగారు.

బండి తీయాలంటేనే భయం

గతంలో లీటరు పెట్రోలుపై రాష్ట్ర ప్రభుత్వం వ్యాట్ రూ.11.95 వసూలు చేసేది. జగన్ అధికారంలోకి వచ్చిన రెండేళ్ళ తర్వాత వ్యాట్ పెంచుకుంటూ పోయారు. దేశంలో ఎక్కడా లేని రోడ్డు అభివృద్ధి పన్ను కూడా ఈ భారానికి జోడించారు. దీంతో 2022లోనే ఇంధనంపై వ్యాట్ రూ.15.44కి చేరుకుంది. ఇప్పుడది ఇంకా పెరిగిపోయింది. తాజాగా పెట్రోలు ధర తీరును పరిశీలిస్తే డీలర్‌కు లీటర్ రూ.60.39కి విక్రయిస్తుండగా ఎక్సైజ్ డ్యూటీ కింద రూ.19.90 వేస్తున్నారు. డీలర్ కమీషన్‌గా రూ.2.84, వ్యాట్ రూపంలో ఏకంగా రూ.26.39 వసూలు చేస్తున్నారు. వ్యాట్ అమాంతం పెంచేయడంతో ఇంధన వినియోగదారులు బండి తీయాలంటేనే భయపడుతున్నారు.

వినియోగదారులకు డీ'జెల్ల'

వ్యాట్ ప్రభావంతో డీజిల్ ధరలూ పెరిగి ఆటో డ్రయివర్లు లాంటి చిన్న బతుకుల నడ్డి విరిచింది. లీటర్ డీజిల్ డీలరుకు రూ.50.47కి విక్రయిస్తుండగా ఎక్సైజ్ డ్యూటీ కింద రూ.17.65, డీలరు కమీషన్‌గా రూ.2.84,వ్యాట్ రూపంలో రూ.26.39 వసూలు చేస్తున్నారు. దీంతో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మన బంకుల్లో ధరలు అధికంగా ఉంటున్నాయని వాహన చోదకులు గగ్గోలు పెడుతున్నారు. తమపై జగన్‌కు నిజమైన ప్రేమాభిమానముంటే వ్యాట్ తగ్గించి ఇంత భారం మోపేవారుకాదంటున్నారు వాహన చోదకులు. బయటకు దొరక్కుండా ఇంధన ధరలతో బాదేసి పరోక్షంగా అన్ని ధరలూ పెరిగేలా చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దారుణంగా దోచేస్తున్నారు

జగన్ వచ్చినప్పటి నుంచి పెట్రోలు,డీజిల్ ధరలు పెరిగిపోయాయి. దీనికితోడు .రోజూ ఎక్కడో ఒక చోట పోలీసులు అన్యాయంగా మా ఆటో డ్రయివర్లపై పెనాల్టీలు వేస్తూనే వున్నారు. వారంలో రూ.500 నుంచి రూ. 800 వరకు చలానాలు కడుతున్నాం. మా నుంచి దోచుకుంటున్నారేగాని పైసా ఉపయోగం లేదు.

- శ్రీనివాస్, ఆటో డ్రైవర్, మంగళం

ఏమీ మిగలడం లేదు

లారీలు, వ్యాన్లు బాడుగకు అడిగేవారే లేకుండా పోయారు. లోనులో బండి తీసి ఖాళీగా పెట్టుకుంటున్నాను. అయినా క్వార్టర్ ట్యాక్స్ కట్టాల్సిందే. చంద్రబాబు హయంలో క్వార్టర్ ట్యాక్స్ రూ. 800 కట్టేవాళ్ళం. దాన్ని రద్దు చేసి జగన్ లైఫ్ ట్యాక్స్ పేరుతో రూ.38,000 వసూలు చేస్తున్నారు. ఇది కాకుండా గ్రీన్ ట్యాక్స్ మరో 1200కట్టాలి. ఇవన్నీ భరించలేక బండ్లు అమ్ముకుంటున్నాం.

- గోపి, ఐషర్ వాహనం, తిరుపతి



పరమ చెత్త ప్రభుత్వం

ఇది పరమ చెత్త ప్రభుత్వం. ఏ వర్గాన్ని వదలి పెట్టడంలేదు. పెట్రోలు ధరలు విపరీతంగా పెంచేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ లీటరు రూ.109.52 వుంది. గతంలో రూ.700కి స్కూటర్ ట్యాంకు నిండిపోయేది. ఇప్పుడు రూ. 1150కి పట్టుకుంటే ట్యాంకు నిండతా వుంది. జగన్ వ్యాట్‌తో దారుణంగా బాదేస్తున్నారు.

- రామచంద్ర, మధురానగర్

శ్రీకాళహస్తి చరిత్ర

రాజకీయ ఆధ్యాత్మిక క్షేత్రం



ఆధ్యాత్మికంగానే కాదు రాజకీయంగానూ విశిష్టతను సంతరించుకుంది శ్రీకాళహస్తి. ఇక్కడి సుప్రసిద్ధ శైవక్షేత్రం నిరంతరం భక్తులతో సందడిగా వెలుగొందుతుంది. మరో పక్క ఇక్కడ రాజకీయం కూడా వాడీవేడీగా ఉంటుంది. రాష్ట్రపతి పదవిని అలంకరించిన తెలుగు తేజం నీలం సంజీవరెడ్డి తొలినాళ్లలో 1953 ఉప ఎన్నికల్లో ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా గెలిచి ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. వారసత్వ రాజకీయాలకూ ఈ అసెంబ్లీ నియోజకవర్గం పెట్టింది పేరు. అద్దూరి బలరామిరెడ్డి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలవగా ఆయన కుమారుడు దశరథరామిరెడ్డి ఒక పర్యాయం ఎన్నికయ్యారు. అలాగే బొజ్జల గంగ సుబ్బరామిరెడ్డి ఒకసారి ఎమ్మెల్యేగా గెలుపొందగా ఆయన కుమారుడు గోపాలకృష్ణరెడ్డి ఐదు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తాజా ఎన్నికల్లో ఈ కుటుంబం నుంచి గోపాలకృష్ణరెడ్డి తనయుడు సుధీర్‌రెడ్డి టీడీపీ అభ్యర్థిగా తలపడుతున్నారు. ఇక్కడ నుంచి గెలుపొందిన ముగ్గురు రాష్ట్ర మంత్రులయ్యారు. 1962లో గెలిచిన అద్దూరి బలరామిరెడ్డి విద్యాశాఖ మంత్రి అయ్యారు. బొజ్జల గోపాలకృష్ణరెడ్డి మూడు పర్యాయాలు మంత్రి పదవి నిర్వర్తించారు.

- శ్రీకాళహస్తి

నియోజకవర్గం ఏర్పడింది: 1952
ఎన్నిసార్లు ఎన్నిక జరిగింది:17

నియోజకవర్గం స్వరూపం:
శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, రేణిగుంట మండలాలు, శ్రీకాళహస్తి మున్సిపాలిటీ

ఎమ్మెల్యేలు
- 1952 - అద్దూరి బలరామిరెడ్డి - కాంగ్రెస్
- 1953 -నీలం సంజీవరెడ్డి - కాంగ్రెస్
- 1955 - పత్ర సింగరయ్య - కాంగ్రెస్
- 1962- అద్దూరి బలరామిరెడ్డి - కాంగ్రెస్
- 1967- బొజ్జల జీఎస్ రెడ్డి - స్వతంత్ర
- 1972 - అద్దూరి బలరామిరెడ్డి - స్వతంత్ర
- 1978 - ఉన్నం సుబ్రహ్మణ్యనాయుడు -కాంగ్రెస్
- 1983 - అద్దూరి దశరథరామిరెడ్డి- తెలుగుదేశం
- 1985 - సత్రవాడ మునిరామయ్య - తెలుగుదేశం
- 1988(ఉప ఎన్నిక) - తాటిపర్తి చెంచురెడ్డి - కాంగ్రెస్
- 1989,94,99 -బొజ్జల గోపాలకృష్ణారెడ్డి - తెలుగుదేశం
- 2004- ఎస్‌సీవీ నాయుడు - కాంగ్రెస్
- 2009, 2014- బొజ్జల గోపాలకృష్ణారెడ్డి - తెలుగుదేశం
- 2019 - బియ్యపు మధుసూదనరెడ్డి - వైసీపీ

మొత్తం ఓటర్ల సంఖ్య : 2,47,844
పురుషులు : 1,19,658
మహిళలు: 1,28,172
ఇతరులు : 14

జంపింగ్ జపాంగ్

అటునిటు దూకి...



బుధవారం పల్లం సర్పంచ్ గోపాల్‌యాదవ్‌ను కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న బొజ్జల సుధీర్‌రెడ్డి



గురువారం టీడీపీ నుంచి వైసీపీలో చేరుతూ ఎమ్మెల్యే చేతుల మీదుగా కండువా కప్పుకుంటున్న పల్లం సర్పంచు చీమల గోపాల్ యాదవ్

ఏర్పేడు మండలంలో పల్లం పంచాయతీ సర్పంచు చీమల గోపాల్‌యాదవ్ గత కొన్నాళ్లుగా వైసీపీపై అసంతృప్తితో దూరంగా ఉన్నారు. బుధవారం ఆయన శ్రీకాళహస్తి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుధీర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. అయితే ఏమైందో ఏమోగానీ, అదే చీమల గోపాల్ యాదవ్ గురువారం సాయంత్రం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి సమక్షంలో టీడీపీని వీడి వైసీపీలో చేరుతున్నట్టు ఫోటో ప్రత్యక్షం అయ్యింది.

-ఏర్పేడు

ఇదేనా సాగునీటి భరోసా

- సాగునీటికి పైసా విదల్చని ప్రభుత్వం
- ఆగిపోయిన ప్రాజెక్టుల ఆధునికీకరణ
- తీవ్రంగా నిరసిస్తున్న అన్నదాతలు

అన్నదాత పక్షపాతిని. రైతు సంక్షేమమే మా ప్రభుత్వ ధ్యేయం. సాగునీటి రంగ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం. రైతు భరోసా విడుదల లాంటి సందర్భాల్లో సీఎం జగన్ ఊదరగొట్టే మాటలివి. ఆచరణలో ఆయన మాటలన్నీ నీటిమూటలేనని ఐదేళ్ల అనుభవంలో రైతులందరికీ అర్థమైంది. సత్యవేడు నియోజకవర్గంలో జగన్ ప్రభుత్వం పైసా విదల్చక ఆగిపోయిన నీటి ప్రాజెక్టులే ఇందుకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి.. సాగు రంగాన్ని జగన్ నీరుగార్చారని అన్నదాతలు దుమ్మెత్తిపోస్తున్నారు.

- సత్యవేడు





అటకెక్కిన ఆరణియార్ ఆధునికీకరణ

ఆరువేల ఎకరాల ఆయుకట్టుకు ఆధారమైన అరణియార్ ఆధునికీకరణను జగన్ సర్కార్ పూర్తిగా విస్మరించింది . పిచ్చాటూరు,నాగలాపురం మండలాల్లో రైతులకు మేలు చేసే ఈ ప్రాజెక్టు ఆధునికీకరణకు 2017లో నాటి టీడీపీ ప్రభుత్వం రూ.35 కోట్లు విడుదల చేసింది. 2019 ప్రథమార్థంలో పనులు ప్రారంభమయ్యాయి. అదే ఏడాది వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పనులు అటకెక్కాయి. కాంట్రాక్టరుకు సకాలంలో ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదు. అప్పటి నుంచి అతీగతి లేదు. ప్రాజెక్టు ఆధునికీకరణ పూర్తిస్థాయిలో జరిగితే ఏటా రెండు పంటలు సాగు చేయవచ్చు.



కేవీబీపురం మండలంలోని కాళంగి రిజర్వాయర్

కలగా కాళంగి ఆధునికీకరణ

కేవీబీపురం మండలంలోని కాళంగి రిజర్వాయర్ ఆధునికీకరణ అమలుచేయని హామీల చిట్టాలో మిగిలిపోయింది. నాలుగేళ్ళలో ప్రాజెక్టు అభివృద్ధికి ఈ ప్రభుత్వం పైసా కూడా విడుదల చేయలేదు. మూడు టీఎంసీల సామర్థ్యానికి పెంచుతామన్న నేతల మాట నెరవేరలేదు. ఇటీవల గేట్ల మరమ్మతులకు మొక్కుబడిగా రూ.10 లక్షలు విడుదల చేసి ప్రభుత్వం చేతులు దులుపుకొంది.

- నారాయణవనం మండలంలోని వెత్తలతడుకు, తిరువట్యం ప్రాజెక్టులకు 2005లో భూమిపూజ జరిగింది. ప్రాజెక్టుల పనులు పూర్తయి పదేళ్లవుతున్నా కుడి, ఎడమ కాలువల నిర్మాణం పూర్తికాక నిరుపయోగంగా మారింది.
- నాగలాపురం మండలం భూపతీశ్వరప్రాజెక్టు ఆధునికీకరణ మాటలకే పరిమితమైంది. నిల్వ సామర్థ్యం లేక ఏటా కొండ కోనల నుంచి వచ్చే వర్షపు నీరు సముద్రం పాలవుతోంది. సత్యవేడు, నాగలాపురం మండలాల్లో మూడువేల ఎకరాలకు ఈ ప్రాజెక్టే ఆధారం.
- నల్లచెరువు ఎడమ కాలువలో నాలుగేళ్ళ నుంచి పూడికతీత పనులు చేపట్టలేదు. ఆయకట్టులోని 3500 ఎకరాలకు నీరు అందడం గగనంగా మారింది.
- వరదయ్యపాళెం మండలంలోని ఉబ్బలమడుగు ప్రాజెక్టు పరిస్థితి కూడా దయనీయంగా ఉంది.